కక్ష సాధింపు కొరకే
దర్యాప్తు సంస్థలు
● కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ఇబ్బంది పెడుతున్న బీజేపీ
● నేనూ సీఎం కావచ్చు : మాజీ మంత్రి నాగేంద్ర

జొన్న కొనుగోలు సొమ్ము
విడుదల చేయాలి
8
● నిర్లక్ష్యం వహిస్తే రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి సిద్ధం : కన్నడ నాడు రైతు సంఘం హెచ్చరిక




అటు ఇటు

● ఒకే నియోజకవర్గంలోకి రెండు పాలికెల ప్రాంతాలు
● గ్రేటర్ బెంగళూరులో సరిహద్దు సమస్య
● అసంతృప్తిలో ఆరుగురు ఎమ్మెల్యేలు
● స్థానికుల ద్వారా అభ్యంతరాలు లేవనెత్తే ప్రయత్నం

బెంగళూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): బీబీఎంపీ పాలికెల విభజన నేతలకు కొత్త సమస్య తెచ్చింది. నియోజకవర్గాల పరిధి కాస్త ఆ వార్డు.. కాస్త మరో వార్డుల్లో ఉండడంతో నాయకులు తలలు పట్టుకుంటున్నారు. దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న బెంగళూరు నగర పరిధి పెరిగిపోతోందని, వలసలు వచ్చేవారి సంఖ్య లక్షలు దాటుతోందని ఇలా కోటిన్నరమంది జనాభా కల్గిన బృహత్ బెంగళూరు మహానగర పాలికె (బీబీఎంపీ)ని ఒకే కేంద్రం 8 సబ్‌డివిజన్‌లుగా పర్యవేక్షించడం సాధ్యం కావడం లేదని ప్రభుత్వం బీబీఎంపీని రద్దు చేసింది. ఆ స్థానంలో గ్రేటర్ బెంగళూరు అథారిటీ (జీబీఏ)ను తీసుకొచ్చింది. గ్రేటర్ బెంగళూరు అథారిటీకి ఉన్న అడ్డంకులన్నీ తొలగాయి. ఇలా కేబినెట్ ఆమోదంతో బీబీఎంపీ కాస్త గ్రేటర్ బెంగళూరు అయ్యింది. గ్రేటర్ బెంగళూరు అథారిటీ ఏర్పాటుకు శాసనసభ్యుల కమిటీ నివేదిక సమర్పించింది. గ్రేటర్ బెంగళూరు అథారిటీ చట్టం 2024 అమలు చేసేందుకు నగర పరిధిలోని ఎమ్మెల్యేలందరినీ ఆహ్వానించి సలహాలు తీసుకున్నారు. పాలకపక్ష, ప్రతిపక్ష ఎమ్మెల్యేల సలహాలకు ప్రభుత్వం అంగీకారం తెలిపింది. అందుకు అనుగుణంగా ఐదు పాలికెలను ఏర్పాటు చేశారు. మూడురోజులక్రితం డీసీఎం డీకే శివకుమార్ బెంగళూరు నగరాభివృద్ధిశాఖ మంత్రి హోదాలో ఐదు పాలికెలను ప్రకటించారు. ఇందులో ఎటువంటి మార్పులు ఉండకుండా అన్నింటికీ బెంగళూరు పేరు ఉంటుందని ప్రకటించారు. బెంగళూరు ఉత్తర, బెంగళూరు సెంట్రల్, బెంగళూర పశ్చిమ, బెంగళూరు దక్షిణ, బెంగళూరు తూర్పు పాలికెలుగా విభజించారు.

30రోజుల్లో అభ్యంతరాలు..

గ్రేటర్ బెంగళూరు పరిధిలో 5 పాలికెలకు సంబంధించి గెజిట్ జారీ చేసిన ప్రభుత్వం ఎటువంటి సలహాలు, అభ్యంతరాలు ఉన్నా 30 రోజుల్లో తెలపాలని సూచించింది. అయితే బెంగళూరు నగర శివారు ప్రాంతాల ఎమ్మెల్యేలు కొత్తగా ఏర్పాటు చేసిన పాలికెల సరిహద్దులపై మండిపడుతున్నారు. దాసరహళ్ళి, రాజరాజేశ్వరినగర్, యశ్వంతపుర, పద్మనాభనగర్, మహదేవపుర, పులకేశినగర్ ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాన్ని ఒకే పాలికె పరిధికి తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు. ఇందుకు స్థానిక ప్రజల ద్వారా అభ్యంతరాలు వ్యక్తం చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. స్థానిక ప్రజల ద్వారా వార్డుల విభజన అంశాన్ని అడ్డుకోవాలని లేదా సరిచేసేలాంటి అవకాశం వస్తుందని భావిస్తున్నారు. వాస్తవానికి ఆరుగురు ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాలలోనూ వార్డులు రెండు పాలికెలకు అనుబంధంగా ఉన్నాయని అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. వీరిలో ఐదుగురు బీజేపీకి చెందినవారు కాగా ఒకరు మాత్రమే అధికార కాంగ్రెస్‌కు చెందినవారు.



ఐదు పాలికెల విస్తీర్ణం.. జనాభా

● బెంగళూరు ఉత్తర 158 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం కాగా 31 లక్షలమంది జనాభా ఉన్నారు. జనాభా సాంద్రత చదరపు కిలోమీటరుకు 19,620మంది ఉన్నారు.
● బెంగళూరు దక్షిణ 147 చదరపు కిలోమీటర్ల విస్తర్ణం కాగా జనాభా 30లక్షలమంది ఉండగా జనసాంద్రత చదరపు కిలోమీటరుకు 20,408మంది ఉన్నారు.
● బెంగళూరు తూర్పు 168 చదరపు కిలోమీటర్లు కాగా జనాభా 13 లక్షలమంది ఉన్నారు. చదరపు కిలోమీటరుకు 7,738మంది ఉన్నారు.
● బెంగళూరు పశ్చిమ 161 చదరపు కిలోమీటర్లు ఉండగా జనాభా 45 లక్షలమంది ఉన్నారు. చదరపు కిలోమీటరుకు జనసాంద్రత 27,950మంది ఉన్నారు.
● బెంగళూరు సెంట్రల్ పరిధి 78 చదరపు కిలోమీటర్లు కాగా జనాభా 25లక్షలమంది ఉన్నారు. ప్రతి చదరపు కిలోమీటరుకు జనసాంద్రత 32,051 మంది ఉన్నారు.

విస్తీర్ణం, జనాభా ప్రాతిపదకన సమగ్రంగా పాలికెలను విభజించలేదనే విమర్శలు ఉన్నాయి. బెంగళూరు తూర్పులో కేవలం 13లక్షల మంది జనాభా ఉండగా బెంగళూరు సెంట్రల్‌లో 25లక్షలమంది, ఉత్తర, దక్షిణలో 30లక్షలకుపైగా ఉన్నారు.

నియోజకవర్గాల వారీగా పాలికెలు

● బెంగళూరు ఉత్తర పరిధిలో యలహంక, హెబ్బాళ, బ్యాటరాయనపుర, సర్వజ్ఞనగర, పులకేశినగర్(కుశాలనగర్ వార్డు కాకుండా), దాసరహళ్ళి పరిధిలో శెట్టిహళ్ళి, బాగలకుంటె, మల్లసంద్ర, టీ దాసరహళ్ళి వార్డులు చేరాయి. రాజరాజేశ్వరినగర్ నియోజకవర్గంలో జే.పీపార్క్, యశ్వంతపుర, జాలహళ్ళి వార్డులు ఉన్నాయి.
● బెంగళూరు దక్షిణ పాలికెలో జయనగర్, బీటీఎం లే అవుట్, బెంగళూరు దక్షిణ, బొమ్మనహళ్ళి, పద్మనాభనగర నియోజకవర్గంలో కుమారస్వామి లే అవుట్, బనశంకరి ఆలయం, పద్మనాభనగర, చిక్కల్లసంద్ర వార్డు, మహదేవపుర నియోజకవర్గంలో బెళ్ళందూరు వార్డు, యశ్వంతపుర నియోజకవర్గంలోని హెమ్మిగెపుర వార్డులోని కొన్ని ప్రాంతాలు, ఆర్ఆర్ నగర్ నియోజకవర్గంలోని కొన్ని వార్డులు ఉన్నాయి.
●బెంగళూరు తూర్పు పాలికెలో కేఆర్‌పుర, మహదేవపు (బెళ్ళందూరు వార్డు మినహాయించి) ఉన్నాయి.
●బెంగళూరు పశ్చిమ పాలికెలో గోవిందరాజనగర్, విజయనగర్, మహలక్ష్మీ లే అవుట్, మల్లేశ్వరం, రాజాజినగర్, బసవనగుడి, ఆర్ఆర్ నగర్‌లోని లగ్గెరె, కొట్టిగె పాళ్య, లక్ష్మీదేవనగర్, హెచ్ఎంటి, జ్ఞానభారతి, ఆర్ఆర్ నగర్ వార్డులోని కొన్ని ప్రాంతాలు, యశ్వంతపుర నియోజకవర్గంలోని హెమ్మిగెపుర వార్డులోని కొంత ప్రదేశం, పద్మనాభనగర్ నియోజకవర్గ పరిధిలోని హొసకెరెహళ్ళి, కరిసంద్ర, గణేశ్‌మందిర, యడియూరు వార్డులు ఉన్నాయి.
● బెంగళూరు సెంట్రల్ పాలికెలో గాంధీనగర్, చిక్కపేట, శివాజీనగర్, చామరాజపేట, శాంతినగర్, సీవీరామన్‌నగర్, పులకేశినగర్‌లోని కుశాలనగర్ వార్డు అనుబంధంగా ఉంది.
● ఒకటికంటే ఎక్కువ పాలికెలకు చేరిన నియోజకవర్గాల్లో దాసరహళ్ళి నియోజకవర్గంలో చొక్కసంద్ర, హెగ్గనహళ్ళి, రాజగోపాలనగర్ వార్డుల్లో పశ్చిమపాలికెలోనూ, శెట్టిహళ్ళి, బాగలగుంటె, మల్లసంద్ర, టీ దాసరహళ్ళి వార్డులు ఉత్తర పాలికెలోనూ, హెమ్మిగెపుర వార్డులోని కొన్ని ప్రాంతాలు దక్షిణ పాలికెలోకి చేరుతాయి. ఇలా దాసరహళ్ళి నియోజకవర్గం ఇలా ఏకంగా మూడు పాలికెల్లోకి విభజించారు.
● ఆర్ఆర్‌నగర్ నియోజకవర్గంలో లగ్గెరె, కొట్టిగెపాళ్య, లక్ష్మీదేవనగర్, హెచ్ఎంటీ, జ్ఞానభారతి వార్డులు పశ్చిమపాలికెలోనూ, జేపీ పార్క్, జాలహళ్ళి, యశ్వంతపుర ఉత్తర పాలికెలో ఉన్నాయి. యశ్వంతపుర నియోజకవర్గం హెమ్మిగెపుర వార్డులో ఎక్కువభాగం పశ్చిమపాలికెకు, ఇదే వార్డులోని కొంతప్రాంతం దక్షిణ పాలికెకు చేరింది. పద్మనాభనగర నియోజకవర్గంలోని హొసకెరెహళ్ళి, కరిసంద్ర, గణేశమందిర, యడియూరు వార్డులు పశ్చిమ పాలికెలోనూ, కుమారస్వామి లే అవుట్, బనశంకరి, చిక్కల్లసంద్ర వార్డులు దక్షిణ పాలికెలోనూ, మహదేవపుర నియోజకవర్గంలోని బెళ్ళందూరు వార్డు దక్షిణ పాలికెలోనూ, మిగిలిన వార్డులు తూర్పు పాలికెలో చేరాయి. పులకేశినగర్ నియోజకవర్గం కుశాలనగర్ వార్డు బెంగళూరు సెంట్రల్ పాలికెలోనూ, మిగిలిన వార్డులు ఉత్తర పాలికెలోనూ చేరాయి. ఇలా సరిహద్దులోని నియోజకవర్గాల ఎమ్మెల్యేలకు పాలికెల విభజన షాక్ ఇస్తోంది. 6 శాసనసభ నియోజకవర్గాల పరిధిలో ఐదుమంది ఎమ్మెల్యేలు కాగా కేవలం పులకేశినగర్ ఎమ్మెల్యే ఏసీ శ్రీనివాస్‌కు సమస్య ఏర్పడింది. ప్రభుత్వం పునరాలోచించి పాలికెల విభజన చేపట్టాలని నేతలు కోరుతున్నారు.

సీఎంతోపాటు ఢిల్లీ వెళ్తా

● ఎమ్మెల్సీ, కార్పొరేషన్ అభ్యర్థుల జాబితాపై అధిష్టానంతో చర్చలు: డీసీఎం డీకే శివకుమార్



బెంగళూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి): నాలుగు ఎమ్మెల్సీ స్థానాలతోపాటు బోర్డులు, కార్పొరేషన్‌ల అధ్యక్ష నియామకాలకు సంబంధించి అధిష్టానతో చర్చించేందుకు సీఎంతో కలసి ఢిల్లీ వెళ్లనున్నట్టు డీసీఎం డీకే శివకుమార్ తెలిపారు. సోమవారం సదాశివనగర్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన అధిష్టానంతో భేటీ అయి అన్ని విషయాలు చర్చిస్తామన్నారు. ధర్మస్థళ వివాదానికి సంబంధించి సమగ్ర సమాచారం లేదని దాటవేశారు. సీనియర్ అధికారులతో దర్యాప్తునకు సిట్ ఏర్పాటు చేశారన్నారు. విచారణ ముగిసేదాకా మాట్లాడరాదన్నారు. బీజేపీ వారు ఏమైనా చెబుతారన్నారు. కోర్టు ముందు ఓ వ్యక్తి పలు అంశాలు ప్రస్తావించారని, వాటి వాస్తవాలపై దర్యాప్తు సాగుతోందన్నారు. మీడియాలో ఎక్కువగా కథనాలు వస్తున్నాయన్నారు. జీఎస్టీ నోటీసుల విషయమై మాట్లాడుతూ బీజేపీ వారు అరటిపండు తిని మా నోళ్లకు పూసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం 2019లోనే ఏడాదికి రూ.40లక్షల లావాదేవీల పరిమితిని విధించిందన్నారు. రాష్ట్రప్రభుత్వాలు పాటించాల్సి ఉంటుందన్నారు. ఇప్పటికే 14వేలమందికి నోటీసులు ఇచ్చారన్నారు. కేంద్ర కమిటీ ఒత్తిడి మేరకే నోటీసులు జారీ అయ్యాయన్నారు. కాగా మంగళవారం నుంచి 3 రోజులపాటు అందుబాటులో ఉండడన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతోపాటు ఎవరినీ కూడా భేటీ కాలేనన్నారు. ఎవరూ తప్పుగా అర్థం చేసుకోరాదన్నారు.

మండ్యలో మెడికో ఆత్మహత్య

బెంగళూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి): మండ్య మెడికల్ కళాశాల హాస్టల్‌లో కొప్పళకు చెందిన భరత్ ఎత్తినమనె (19) ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆదివారం రాత్రి హాస్టల్ రూంలో ఆత్మహత్య చేసుకున్నాడు. స్నేహితులు అతడి రూంను పరిశీలించినప్పుడు విషయం వెలుగులోకి వచ్చింది. ఈ విషయమై మెడికల్ కళాశాల డైరెక్టర్ నరసింహస్వామి మీడియాతో మాట్లాడుతూ రాత్రి 12 గంటలవరకు భరత్, పక్క గదిలోని ఓ స్నేహితుడితో మాట్లాడాడన్నారు. తర్వాత రూంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడన్నారు. అతడితోపాటు మరో ఇద్దరు అదే గదిలో ఉండేవారని, వారు సొంతూళ్లకు వెళ్లారన్నారు. సోమవారం ఉదయం ఓ విద్యార్థి తెలిపిన మేరకు విషయం వెలుగులోకి వచ్చిందన్నారు. భరత్ ఫుట్‌బాల్ క్రీడాకారుడని, గత ఏడాది సక్రమంగా హాజరు కాలేదని, అటెండెన్స్ తక్కువగా ఉన్న కారణంగా పరీక్షలు రాసే అవకాశం కోల్పోయాడన్నారు. ఈ ఏడాది సబ్జెక్టులు క్లియర్ చేసుకోవాలని భావించాడన్నారు.

ర్యాగింగ్‌కు భయపడి మరొకరు..


అరుణ్ (ఫైల్)

సీనియర్ విద్యార్థులు ర్యాగింగ్‌తో ఇబ్బంది పడుతున్నారని నెలమంగలలోని నందరామయ్య పాళ్యలో ఆర్కిటెక్చర్ విద్యార్థి అరుణ్ (22) ఆత్మహత్య చేసుకున్న విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఓ సెల్ఫీ వీడియో తీసి సీనియర్లు వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. హాసన్‌కు చెందిన చన్నకేశవ, తులసి దంపతులు పిల్లల చదువుకోసం నెలమంగలకు వచ్చి జీవిస్తున్నారు. తల్లిదండ్రులు కూలి పనులు చేసుకుని కుటుంబాన్ని పోషించేవారు. అరుణ్ ప్రతిభావంత విద్యార్థిగా గుర్తింపు పొందాడు. నగరంలోని ఓ కళాశాలలో ఉత్తమ ప్రతిభతో సీట్ పొంది చదువు కొనసాగిస్తున్నాడు. ఈనెల 11న ఆత్మహత్య చేసుకున్నాడు. వీడియో వైరల్ కావడంతో మాదనాయకనహళ్ళి పోలీసులు సోమవారం కేసు నమోదు చేసుకున్నారు.

నోటీసులకు భయపడవద్దు.. జీఎస్టీలో నమోదు చేసుకోండి

● వాణిజ్య శాఖ జాయింట్ కమిషనర్ మీరా సురేశ్ పండిట్



బెంగళూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి): నోటీసులకు భయపడాల్సిన అవసరం లేదని, ప్రతి వ్యాపారి జీఎస్టీలో నమోదు చేసుకోవాలని వాణిజ్య పరిశ్రమలశాఖ నాల్గో డివిజన్ జాయింట్ కమిషనర్ మీరా సురేశ్ పండిట్ సూచించారు. సోమవారం కోరమంగళలోని బీఎంటీసీ భవన్‌లో వ్యాపారులకు అవగాహనా శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కమిషనర్ మాట్లాడుతూ 40లక్షలకుపైగా లావాదేవీలు జరిపినవారు మాత్రమే పన్ను చెల్లించాల్సి ఉంటుందన్నారు. పాన్ కార్డు, బ్యాంకు వివరాలకు అనుగుణంగా నోటీసులు జారీ చేశామన్నారు. అన్నింటికీ పన్నులు చెల్లించాల్సిన అవసరం ఉండదని, మినహాయింపులో పాలు, పండ్లు, కూరగాయలు, మాంసం తదితర ఆహార పదార్థాలకు వర్తిస్తుందన్నారు. ఏడాది లావాదేవీలకు అనుగుణంగా నోటీసులు జారీ చేశామని, వాటి వివరాలను జీఎస్టీ కార్యాలయంలో సమర్పించాలన్నారు. పాన్, ఆధార్ కార్డు, ఏదైనా గుర్తింపుకార్డుతో జీఎస్టీ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చునన్నారు. సమావేశంలో 200మందికిపైగా వ్యాపారులు, ఆడిటర్లు పాల్గొన్నారు.

నగరంలో జోరువాన



బెంగళూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): నగరవ్యాప్తంగా జోరు వాన కురిసింది. సోమవారం ఉదయం నుంచే ముసురు కొనసాగింది. మధ్యాహ్నం 11 గంటలనుంచే నగరంలోని వివిధ ప్రాంతాల్లో వర్షం కురిసింది. కళాశాలల వద్ద విద్యార్థులు, ఉద్యోగులు ఇళ్లకు వెళ్లేందుకు ఇబ్బంది పడ్డారు. ద్విచక్రవాహన దారులు గొడుగులతో ప్రయాణం చేయాల్సి వచ్చింది. మైసూరు, మండ్య, కోలారు, చిత్రదుర్గ జిల్లాల్లో ఓ మోస్తరు వర్షం కురవగా, ఉత్తర కర్ణాటక, తీరప్రాంత జిల్లాల్లో భారీ వర్షం కురిసింది.


వర్షంలో ఇబ్బంది పడుతున్న వాహనదారులు


కేబుల్ బ్రిడ్జ్‌పై పర్యాటకుల సందడి

సిగందూరు కిటకిట

● అమ్మ దర్శనానికి పోటెత్తుతున్న భక్తులు
● కేబుల్ బ్రిడ్జ్‌పై రీల్స్, ఫొటోషూట్‌ల సందడి

బెంగళూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి): సిగందూరు అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తుతున్నారు. ఐదున్నర దశాబ్దాలకాలంగా భక్తులు లాంచీల్లో ప్రయాణించి ద్వీపంలా ఉండే ప్రాంతానికి వెళ్లి సిగందూరు చౌడేశ్వరిదేవిని దర్శించుకునేవారు. గతవారం కేబుల్ బ్రిడ్జ్‌ను లాంఛనంగా ప్రారంభించారు. దేశంలోనే అతిపెద్ద కేబుల్ బ్రిడ్జ్‌ల్లో ఇది ఒకటిగా ఉంది. దీంతో స్థానికులు పెద్ద ఎత్తున కేబుల్ బ్రిడ్జ్‌పై ప్రయాణించేందుకు ఆసక్తి చూపారు. ఆదివారం వేలసంఖ్యలో వాహనాల్లో పర్యాటకులు తరలివచ్చారు. సుమారు 2కిలోమీటర్లకుపైగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. పార్కింగ్ సమస్య ఏర్పడింది. ఓవైపు వర్షంలో కేబుల్‌బిడ్జ్‌పై పొటోలు, వీడియోలు తీసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో కేబుల్ బ్రిడ్జ్‌పై వాహనాలు కదలడం కూడా కష్టమవుతోంది. దీంతో కొందరు పర్యాటకులు మరో నెల రోజులపాటు సిగందూరుకు రావద్దంటూ వీడియోలు తీసి వైరల్ చేస్తున్నారు.

నేడు భద్ర డ్యాం నుంచి కాలువలకు నీరు

బెంగళూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి): శివమొగ్గ జిల్లా భద్ర జలాశయం నుంచి ఆయకట్టు పరిధిలో పంటలసాగుకు మంగళవారం నుంచి నీటిని విడుదల చేస్తామని భద్ర ఆయకట్టు అభివృద్ధి ప్రాధికార అధ్యక్షుడు, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి మధు బంగారప్ప తెలిపారు. కుడి కాలువద్వారా 120 రోజులపాటు నీరు వదులుతామని, ఎడమ కాలువకు ఎప్పుడు వదిలేది ప్రకటిస్తామన్నారు. కర్ణాటక నీరావరి చట్టం 1965 ప్రకారం పంటలసాగుకు మాత్రమే నీటిని ఉపయోగించుకోవాల్సి ఉంటుందన్నారు. ఉల్లంఘనలకు పాల్పడరాదన్నారు. కాలువలు ధ్వంసం చేయడం, ఎక్కువ నీటిని వృథా చేయడం చర్యలకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తప్పవన్నారు. భద్ర ప్రాజెక్టు నీటి సలహా సమితి కార్యదర్శి ఆర్ రవిచంద్ర తెలిపారు.

బీజేపీ, జేడీఎస్ మట్టిలో కలిసిపోవడం ఖాయం

● పావగడలో 'ఇంటింటి గంగ' ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి సిద్దరామయ్య

పావగడ, జూలై 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనుల వల్ల బీజేపీ, జేడీఎస్ మట్టిలో కలిసిపోతాయని ముఖ్యమంత్రి సిద్దరామయ్య అన్నారు. సోమవారం 'ఇంటింటి గంగను పావగడ పట్టణంలో ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటింటి గంగ, సోలార్‌పార్క్ నిర్మాణానికి భూమిపూజ చేసింది తానేనన్నారు. తుంగభద్ర నీరు 238 గ్రామాలకు నీరు అందనుందన్నారు. హోంమంత్రి పరమేశ్వర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గ్యారంటీల పేరుతో రాష్ట్రాన్ని నట్టేట ముంచుతున్నాయని బీజేపీ ఆరోపించడం అర్థరహితమన్నారు. రెండు సంవత్సరాల్లో రూ. లక్ష కోట్లకుపైగా పంచ గ్యారంటీల కోసం నిధులు కేటాయించడం జరిగిందన్నారు. పావగడ పట్టణం నుంచి బెంగళూరు, మైసూరు, ఇతర ప్రాంతాలకు వలసవెళ్తున్నారని వలసలను అరికట్టాలని చిత్రదుర్గం ఎంపీ గోవిందకారజోళ సీఎం దృష్టికి తీసుకెళ్లారు. సోలార్‌పార్క్ నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతుల కుటుంబాలకు ఉద్యోగాలు ఇచ్చి స్థానికులకు కూడా ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

కారులోనే సీఎం ప్రయాణం

పట్టణంలోని కార్యక్రమాలకు సీఎం సిద్దరామయ్య హెలికాప్టర్ ద్వారా వస్తారని అనుకున్నప్పటికీ వాతావరణం అనుకూలించకపోవడంతో ఆయన కారులోనే వచ్చి ఆయా కార్యక్రమాలకు హాజరయ్యారు. ముగింపు అనంతరం కారులోనే తిరుగు ప్రయాణమయ్యారు. సీఎం వెంట సాంఘిక సంక్షేమశాఖ మంత్రి హెచ్.సీ. మహదేవప్ప, పంచాయతీరాజ్ శాఖ మంత్రి ప్రియాంకఖర్గే, పావగడ ఎమ్మెల్యే వెంకటేశ్, ఎమ్మెల్సీలు రాజేంద్ర, శ్రీనివాస్, ఐజీలాబురం, కలెక్టర్ శుభకళ్యాణి, ఎస్పీ అశోక్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ఆదుకోండి: కార్మికసంఘం నాయకులు

కార్మికులను ఆదుకోవాలని సంఘం నాయకులు రామాంజినేయ, నాగరాజు తదితరులు సీఎం సిద్దరామయ్యకు విజ్ఞప్తి చేశారు. సోమవారం పావగడకు వచ్చిన సీఎంను వారు కలిశారు. కార్మికులకు అనేక సౌకర్యాలు ఉన్నా వాటి అమలు జరగడంలేదన్నారు. త్వరలో సమస్యలను పరిష్కరిస్తానని సీఎం వారికి హామీ ఇచ్చారు.


'ఇంటింటి గంగ'ను ప్రారంభిస్తున్న సీఎం సిద్దరామయ్య

సమైక్యత చాటుదాం

● ఉపకులాలు వీడుదాం వీరశైవ లింగాయతులుగా పోరాడుదాం ● మంత్రి మల్లికార్జున పిలుపు ● ఒకే వేదికపై ఐదుగురు పీఠాధిపతులు


పీఠాధిపతులకు నమస్కరిస్తున్న బీజేపీ నాయకులు

బెంగళూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మానవత్వానికి దీక్ష ఇచ్చింది వీరశైవ పరంపర అని దేశవ్యాప్తంగా కోట్లాదిమంది వీరశైవలింగాయతులు ఉన్నారని, ఉపకులాలు వీడి వీరశైవలింగాయతలుగా సమైక్యం పాటిద్దామని రాష్ట్రమంత్రి ఎస్ఎస్ మల్లికార్జున పిలుపునిచ్చారు. దావణగెరెలో వీరశైవ పంచపీఠాల పీఠాధిపతులు ఒకే వేదికపై పాల్గొన్నారు. అభినవ రేణుకామందిరంలో అఖిల భారత వీరశైవ శివాచార్య సంస్థ ఏర్పాటు చేసిన చర్చాగోష్టిని సోమవారం ప్రారంభించారు. రంభాపురి పీఠం వీరసోమేశ్వర స్వామీజీ, ఉజ్జయిని సిద్ధలింగ రాజదేశికేంద్రస్వామిజీ శ్రీశైలమఠం చన్నసిద్ధరామ పండితారాధ్యస్వామిజీ, కాశీపీఠం మల్లికార్జున విశ్వారాధ్యస్వామీజీ, కేదారపీఠం బీమాశంకర లింగ శివాచార్యస్వామీజీలు భాగస్వామ్యులయ్యారు. వీరశైవ లింగాయతలు మహారాష్ట్ర, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కర్ణాటకతోపాటు వివిధ రాష్ట్రాల్లో ఉన్నారని అందరూ కలసి నడవాలన్నారు. రాష్ట్రంలో వీరశైవలింగాయతల జనాభా అధికమని, కానీ ఇటీవలి సర్వేలో తగ్గేందుకు పలు కారణాలను విశ్లేషించారు. ఏళ్ల తరబడి శ్యామనూరు శివశంకరప్ప సమైక్యత కోసం పోరాటం చేశారని పలువురు స్వామీజీలు అభిప్రాయపడ్డారు. అఖిల భారత వీరశైవలింగాయత మహాసభ అధ్యక్షుడు శంకరబిదరి, మంత్రి ఈశ్వర్‌ఖండ్రె, మాజీ సీఎం యడియూరప్ప, ఎంపీ జగదీశ్‌శెట్టర్, ప్రభా మల్లికార్జున, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర, ఎమ్మెల్యే విజయానంద కాశప్పనవర్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి అక్రమ తవ్వకాలను
అడ్డుకోండి
● యథేచ్ఛగా తరలింపుపై స్థానికుల ఆగ్రహం

అంతర్జాతీయ సాంకేతిక నిపుణులతో బెంగళూరు టెక్ సమ్మిట్

విద్యార్థులకు ఉచిత హృద్రోగ పరీక్షలు

- వివరాలు..7లో

రెండు ద్విచక్రవాహనాలు ఢీ

యువకుడి మృతి.. మరొకరి పరిస్థితి విషమం



కుళ్లాయప్ప (ఫైల్)

బుక్కరాయసముద్రం, జూలై 21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గాంధీనగర్ వద్ద రెండు ద్విచక్రవాహనదారులు ఢీ కొనడంతో బండారు కుళ్లాయప్ప (23) అనే యువకుడు మృతి చెందగా పవన్ అనే మరో యువకుడి పరిస్థితి విషమంగా మారింది. పోలీసులు తెలిపిన మేరకు.. మండల పరిధిలోని రేకలకుంట గ్రామానికి చెందిన బండారు నల్లప్ప కుమారుడు కుళ్లాయప్ప ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తూ జీవనం సాగించేవాడు. అనంతపురంలోని ఓ ప్రైవేటు భవనంలో పని చేసేందుకు సోమవారం ఉదయం బయలుదేరాడు. అదే సమయంలోనే బుక్కరాయసముద్రం వైపు నుంచి గాంధీనగర్‌కు చెందిన బుల్లే పవన్ వస్తుండగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. దీంతో తీవ్రంగా గాయపడిన ఇద్దరిని అనంతపురం సర్వజన ఆసుపత్రికి తరలించారు. నార్పల మండలం నుంచి నైట్ డ్యూటీ ముగించుకుని అటు వైపు నుంచి వస్తున్న ఎస్ఐ సాగర్ తన కారులోనే గాయపడిన ఇద్దరిని ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బండారు కుళ్లాయప్ప మృతి చెందగా.. బుల్లే పవన్‌కుమార్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. బుక్కరాయసముద్రం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డివైడర్‌ను ఢీకొని వ్యక్తి మృతి



గంగాధరప్ప (ఫైల్)

పరిగి, జూలై 21(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ధనాపురం క్రాస్‌వద్ద శిర-కొడికొండ హైవేలో డివైడర్‌ను ఢీకొని గంగాధరప్ప(41) అనే వ్యక్తి ఆదివారం రాత్రి మృతి చెందాడు. ఎస్ఐ రంగడు యాదవ్ తెలిపిన వివరాల మేరకు.. లేపాక్షి మండలం వడ్డిపల్లికి చెందిన గంగాధరప్ప ఆదివారం పావగడ తాలూకా పి.అచ్చంపల్లికి ద్విచక్రవాహనంలో వెళ్లి తిరుగు ప్రయాణంలో ధనాపురం క్రాస్‌వద్ద డివైడర్‌ను ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గమనించి 108 సాయంతో హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్సల అనంతరం మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. భార్య సునందమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు.

జేసీ ప్రభాకర్‌రెడ్డిపై కలెక్టర్‌కు ఫిర్యాదు



కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న అధికారుల సంఘాల నాయకులు

పుట్టపర్తి టౌన్, జూలై 21(ఆంధ్రజ్యోతి): ఇటీవల అనంతపురం డీపీఓ నాగరాజునాయుడుపై తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి చేసిన పరుష వ్యాఖ్యలను ఖండిస్తూ జిల్లా ఎంపీడీఓలు, డిప్యూటీ ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకులు సోమవారం కలెక్టర్ టీఎస్ చేతన్‌కు ఫిర్యాదు చేశారు. జిల్లా ఎంపీడీఓల సంఘం అధ్యక్షుడు నరేంద్ర మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్యే ప్రస్తుత తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఉన్నత ఉద్యోగి అయిన డీపీఓ పట్ల అనుచితగా ప్రవర్తించడం ఆయన స్థాయికి తగదన్నారు. ఉద్యోగులు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తుంటారని అన్నారు. వారిని కించపరిచేలా మాట్లాడడం తగదన్నారు. జేసీ వ్యాఖ్యలు ఉద్యోగుల మనోభావాలను దెబ్బతీశాయని అన్నారు. ఇలాంటి సంఘటనలు మరోసారి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అధికారుల సంఘాల నాయకులు నరేష్‌కృష్ణ, నసీమా, నటరాజ్, రఘునాథ్‌గుప్త, నాగేశ్వర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, ఇందిరబాల, గోపాల్‌రెడ్డి, శ్రావణ్, ఓంప్రకాష్, గోపీనాథ్, రమణప్ప, మహేంద్ర తదితరులు ఉన్నారు.

చాకర్లపల్లి రైల్వే స్టేషన్ ప్రారంభం



పూజలో పాల్గొన్న రైల్వే అధికారులు

సోమందేపల్లి, జూలై 21(ఆంధ్రజ్యోతి): గత కొన్నేళ్లగా ఎదురుచూస్తున్న చాకర్లపల్లి రైల్వేస్టేషన్ సేవలు సోమవారం ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. రైల్వే అధికారులు పూజా కార్యక్రమాలు నిర్వహించి సేవలను ప్రారంభించారు. చేనేత వస్త్ర పరిశ్రమకు పేరొందిన సోమందేపల్లిలో నేతన్నలు తమ వ్యాపార కార్యకలాపాలను కొనసాగించేందుకు గతంలో చాకర్లపల్లి రైల్వేస్టేషన్‌ను వినియోగించుకునేవారు. విద్యార్థులు, సమీప గ్రామస్థులు ఈ స్టేషన్ నుంచి ప్రయాణం చేసేవారు. కొన్నేళ్ల క్రితం వివిధ కారణాలతో సేవలు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గత యేడాది పెనుకొండ సమీపంలో తిమ్మాపురం వద్ద నూతనంగా నిర్మించిన రైల్వే ఓవర్‌బ్రిడ్జి ప్రారంభించడానికి వచ్చిన రైల్వేసహాయ మంత్రి సోమన్నను కలిసి ఎంపీ బీకే పార్థసారథి స్థానికులు ఆయన దృష్టికి తెచ్చారు. స్పందించిన ఆయన యేడాదిలోపు చాకర్లపల్లి రైల్వేస్టేషన్ ప్రారంభం, బ్రిడ్జి పనులు పూర్తీచేస్తామని హామీ ఇచ్చారు. ఇందుకు సంబంధించిన నిధులు సమకూర్చడంతో మరమ్మతులు పూర్తీచేసుకుని రైల్వేస్టేషన్ సేవలు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. హైలెవెల్, ఫుట్‌ఓవర్‌బ్రిడ్జి, టికెట్ కౌంటర్, అన్నివిభాగాలను తీర్చిదిద్దడంతో ప్రజలకు రైల్వే సేవలు అందుబాటులోకి వచ్చాయి. రైల్వే అధికారులు నాగభూషణం, కిరణ్‌కుమార్, పూజా కార్యక్రమాలు నిర్వహించి ప్రారంభించారు.

వసతి గృహాలకు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం విద్య, జూలై 21(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులు వసతి గృహాలలో ప్రవేశాలకు దరకాస్తు చేసుకోవాలని జిల్లా విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల శాఖ సహాయ సంచాలకులు అర్చన సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి ఈ ప్రవేశాలు చేపడుతున్నామని తెలిపారు. అనంతపురం హెచ్ఎల్‌సీ కాలనీలో బాలుర హాస్టల్, అరవిందనగర్‌లో బాలికల హాస్టల్ ఉన్నాయని వివరించారు. 100 మంది బాలురు, 50 మంది బాలికలకు అవకాశం ఉందని తెలిపారు. మూడో తరగతి నుంచి డిగ్రీ చదువుకునే శారీరక బధిరులు, అంధులు అర్హులన్నారు. ఉచిత వసతి, భోజనం, దుస్తులు, పుస్తకాలు, ట్రంకుపెట్టెలు, ప్లేట్లు, గ్లాసులు, కాస్మోటిక్ చార్జీలు ఇస్తామని అన్నారు.

టమోటా కిలో రూ.33

అనంతపురం రూరల్, జూలై 21(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో సోమవారం కిలో టామోటా గరిష్టంగా రూ.33తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అదేవిధంగా కనిష్టంగా రూ.13తో, సరాసరి ధర రూ.23తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 2100టన్నుల టమోటాలు వచ్చినట్లు పేర్కొన్నారు.

చీనీ టన్ను రూ.15వేలు

అనంతపురం నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్టంగా రూ.15వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. అలాగే కనిష్టంగా రూ.3వేలు, సరాసరి ధర రూ.10వేలు పలికాయన్నారు.

బాధ్యతలు చేపట్టిన డీటీడబ్ల్యూఓ శ్రీనివాసరావు

అనంతపురం విద్య, జూలై 21(ఆంధ్రజ్యోతి): జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారిగా శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. ఆయనను నెల రోజుల క్రితం అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి ఇక్కడికి డీటీడబ్ల్యూఓగా ప్రభుత్వం నియమించింది. ఉత్తర్వులు వచ్చి నెల రోజులైనా రాకపోవడంతో అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో ఆయన సోమవారం జిల్లాకు చేరుకున్నారు. తొలుత ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణశర్మను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం డీటీడబ్ల్యూఓ కార్యాలయానికి వెళ్లి బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయ సూపరింటెండెంట్ సురేష్‌తో పాటు ఇతర సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

దొంగల ముఠా అరెస్ట్

- రూ.19 లక్షల వాహనాలు స్వాధీనం
- ఏడుగురిలో నలుగురు మైనర్లు
- జువైనల్ కోర్టుకు నిందితులు



వాహనాలను పరిశీలిస్తున్న పోలీసులు

అనంతపురం క్రైం, జూలై 21(ఆంధ్రజ్యోతి): నకిలీ తాళాలతో ద్విచక్ర వాహనాలను చోరీ చేసే ముఠాను అనంతపురం టూటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. ఇళ్లు, పార్కులు, ఆసుపత్రులు, ఇతర ప్రాంతాల్లో పార్కింగ్ చేసిన వాహనాలే లక్ష్యంగా చోరీ చేసే ఏడుగురు సభ్యులున్న ముఠాను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.19లక్షల విలువైన వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను జువైనల్ కోర్టుకు హాజరు పరిచారు. అనంతపురం డీఎస్పీ శ్రీనివాసరావు, టూటౌన్ సీఐ శ్రీకాంత్ యాదవ్, 4వ పట్టణ సీఐ జగదీష్, టూ టౌన్ ఎస్ఐ రుషీంద్రబాబుతో కలిసి సోమవారం రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో విలేకరులకు వివరాలు వెల్లడించారు.

ముఠా సభ్యులు వీరే..

ఆకుతోటపల్లి గ్రామానికి చెందిన యతేంద్ర అలియాస్ శివ(20) టూవీలర్ల చోరీలో సిద్ధహస్తుడు. ఇతడిపై ఇప్పటికే 8 కేసులున్నాయి. అనంతపురం, ధర్మవరం, నల్లచెరువు, ఇతర ప్రాంతాల్లో రెండేళ్ల కిందట నుంచి టూవీలర్లు ఎత్తుకెళ్లిన కేసులున్నాయి. ఇతడితో పాటు ఆకుతోటపల్లి గ్రామానికే చెందిన యోగేశ్వర్‌రెడ్డి అలియాస్ యోగి(27), గంగానగర్‌కు చెందిన యశ్వంత్ కుమార్ అలియాస్ బన్నీ(19)తోపాటు మరో నలుగురు మైనర్లు ఓ ముఠాగా ఏర్పడ్డారు. జల్సాలకు అలవాటు పడి వీరంతా నగరంలోని పలు ప్రాంతాల్లో టూవీలర్ల దొంగతనాలు చేసేవారు. నకిలీ తాళాలు ఉపయోగించి పార్కింగ్ చేసిన వాహనాలను సులువుగా ఓపెన్ చేసి ఎత్తుకెళ్లిపోతారు.

రైల్వే స్టేషన్ వద్ద అరెస్టు

పోలీసులకు కొంతకాలంగా టూవీలర్ల చోరీలు తలనొప్పిగా మారాయి. వీటిపై టూటౌన్ పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈనేపథ్యంలో సోమవారం ఉదయం నాయక్‌నగర్ వద్ద తనిఖీ చేస్తుండగా ఆటోలో అనుమానాస్పదంగా వెళ్తున్న ముఠా సభ్యులను పట్టుకున్నారు. వారిని విచారించగా చోరీల విషయం బయటపడింది. టూటౌన్, 4వ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో 19 ద్విచక్రవాహనాలు చోరీ చేసినట్లు నిందితులు ఒప్పుకున్నారు. వారి నుంచి రూ.19 లక్షల విలువైన ద్విచక్రవాహనాలు, ఒక లగేజీ ఆటో రికవరీ చేశారు. నిందితులను జువైనల్ కోర్టుకు హాజరు పరిచారు. నిందితుల అరెస్ట్‌లో కీలకంగా వ్యవహరించిన పోలీసులను డీఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

తొలగని సందిగ్ధత

గ్రేడ్-1 వీఆర్ఓల బదిలీలకు అంతరాయం

గ్రీవెన్స్ ఏర్పాటు చేయకపోవడంలో అంతర్యమేంటో..?



అనంతపురం కలెక్టరేట్, జూలై 21(ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగుల బదిలీలన్నీ ముగిశాయి. కానీ ఇంకా డెప్యుటేషన్లపై వివాదం నడుస్తోంది. గ్రేడ్-1 వీఆర్ఓల బదిలీలపై సందిగ్ధం నెలకొంది. గ్రేడ్-2 వీఆర్వోల బదిలీలు చేపట్టినా గ్రేడ్-1 వీఆర్వోల బదిలీలు నిలిచి పోయాయి. దీంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా జిల్లా కలెక్టర్ శిక్షణ నిమిత్తం ముస్సోరికి వెళ్లడంతో బదిలీలు ఇప్పుడే జరిగేలా లేవనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు సచివాలయ ఉద్యోగులకు గత నెల 30లోపు బదిలీల ప్రక్రియ చేపట్టాల్సింది. కానీ మరో వారం రోజులు ఆలస్యమైంది. దీంతో గ్రేడ్-1 వీఆర్ఓలు సచివాలయాల్లోనే పని చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో 600 మంది

ఉమ్మడి జిల్లా పరిధిలో దాదాపు 600మంది గ్రేడ్-1 వీఆర్వోలు పని చేస్తున్నారు. వీరిలో 80 నుంచి 100మంది వరకు ఒకే చోట ఐదేళ్లు పూర్తయినవారున్నారు. మెడికల్, స్పౌజ్ ఇతర కారణాలతో బదిలీపై వెళ్లాలనుకునే వారు 200మంది వీఆర్వోలున్నట్లు తెలిసింది. బదిలీలు జరగకపోవడంతో ఆ వర్గాలకు ఎదురుచూపే మిగిలింది. జూనియర్, సీనియర్ అసిస్టెంట్లు, డిప్యూటీ తహసీల్దార్ల బదిలీలను జేసీ, డీఆర్ఓల ఆధ్వర్యంలో చేపడతారు. వీఆర్ఓ, తహసీల్దార్లను కలెక్టర్, డీఆర్ఓల ఆధ్వర్యంలో చేస్తారు. కలెక్టర్ ముస్సోరికి శిక్షణకు వెళ్లడంతో గ్రేడ్-1వీఆర్ఓల బదిలీలు ఎప్పుడు జరుగుతాయనేది ప్రశ్నగానే మిగిలిపోయింది.

అడుతారనేనా..?

ప్రతి నెలా మూడో శుక్రవారం ఉద్యోగుల గ్రీవెన్స్ నిర్వహించాలి. తాజాగా ఈనెల18న ఉద్యోగుల గ్రీవెన్స్ రాష్ట్రవ్యాప్తంగా జరిగింది. కానీ జిల్లాలో జరగలేదు. వీఆర్వోల బదిలీలపై ఉద్యోగులు అడుగుతారనే ఉద్దేశంతోనే గ్రీవెన్స్ నిర్వహించలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. మరి ఉద్యోగులు ప్రశ్నకు అధికారులు ఏం సమాధానమిచ్చేవారో తెలియదు కానీ గ్రీవెన్స్ మాత్రం రద్దయింది. గ్రీవెన్స్ నిర్వహించకపోవడం వెనుక అధికారుల అంతర్యమేంటో వారికే తెలియాలి.

జీతాలు ఇంకా రాలే..!

అప్‌గ్రేడ్ హైస్కూళ్ల పాత టీచర్లకు అందని వేతనాలు

కొత్త హెచ్ఎంలకు పొజీషన్ ఐడీలు రాకపోవడమే కారణం

అనంతపురం విద్య, జూలై 21(ఆంధ్రజ్యోతి): ఈఏడాది అప్‌గ్రేడ్ అయిన ఉన్నత పాఠశాల టీచర్లు జూన్ నెల జీతాల కోసం నేటికీ ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం ఈసారి అనేక ప్రాథమికోన్నత పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేసింది. విద్యాశాఖ అధికారిక లెక్కల మేరకు ఉమ్మడి జిల్లాలో 78 ప్రాథమికోన్నత పాఠశాల లను అప్‌గ్రేడ్ చేశారు. ఇలా అప్‌గ్రేడ్ అయిన ప్రతి ఉన్నత పాఠశాలకు ఒక గ్రేడ్-2 హెచ్ఎంను కేటాయించి, ఇటీవల జరిగిన బదిలీలలో అక్కడ పోస్టును కేటాయించారు. ఇంతవరకు బాగానే ఉన్నా, అక్కడ పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్లకు జూన్ జీతాలు ఇప్పటికీ అందలేదు. అందరికీ ఈనెల ఒకటో తేదీనే జీతాలు పడ్డాయి. కానీ ఇక్కడ పని చేస్తున్నవారికి రాలేదు. అప్‌గ్రేడ్ కాని స్కూళ్లలో పని చేస్తున్న స్కూల్ అసిస్టెంట్లకు గతంలో ఎంఈఓ డీడీఓగా వ్యవహరిస్తు, జీతాలు చేసేవారు. ఇపుడు హైస్కూల్ కావడంతో పాటు ఆపాఠశాలలకు హెచ్ఎంను కేటాయించారు. అక్కడ జీతాలు చేయడానికి హెచ్ఎం డీడీఓగా వ్యవహరిస్తారు. అయితే అక్కడకు వచ్చిన హెచ్ఎంలకు డీడీఓగా కోడ్‌లు ఇచ్చారు. కానీ పొజిషన్ ఐడీలు రాకపోవడంతో కొత్తగా వచ్చిన హెచ్ఎంలకు జీతాల బిల్లులు పెట్టడానికి అవకాశం లేకుండా పోయింది. దీంతో అప్‌గ్రేడ్ కాకముందు నుంచి అదే పాఠశాలలో పని చేస్తున్న స్కూల్ అసిస్టెంట్లకు గతనెల జీతాలు ఇప్పటివరకు అంద కుండా పోయాయి.

ఎంఈఓల ద్వారానే ఇప్పించండి

ఈనెల జీతాలు అందకపోవడంతో వివిధ రకాల బ్యాంకు రుణాల ఈఎంఐలు, పిల్లల స్కూల్ ఫీజులు, కుటుంబ అవసరాలు తీర్చుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అప్‌గ్రేడ్ కాకమునుపు మాకు ఎంఈఓలు డ్రాయింగ్ ఆఫీసర్లుగా వ్యవహరిస్తూ జీతాలు చేసేవారు. ఇపుడు క్యాడర్‌స్ట్రెంత్, పొజీషన్‌ఐడీ కేటాయింపులో ఆలస్యమౌతోంది. దీంతో వెంటనే ఉన్నతాధికారులు స్పందించి ఈనెల గతంలో మాదిరే ఎంఈఓల ద్వారానే జీతాలు ఇప్పించి, మా ఇబ్బందులు తీర్చాలి.

- మహ్మద్‌రఫీ, ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి

పచ్చి రొట్టతో ఎరువులు ఆదా

ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణ్ శర్మ

అనంతపురం కలెక్టరేట్, జూలై 21(ఆంధ్రజ్యోతి): పచ్చిరొట్ట పైర్లను వాడటం ద్వారా 25 శాతం ఎరువులు ఆదా అవుతాయని ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ అన్నారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో సోమవారం జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పచ్చిరొట్టకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ... పచ్చిరొట్ట ఎరువుతో మట్టికి జీవం వస్తుందన్నారు. పచ్చిరొట్ట ఎరువుల ద్వారా నేలసారం పెరుగుతుందని, నేల నిర్మాణం పటిష్ఠమవుతుందని, నేల ఆరోగ్యకరంగా ఉంటుందని వివరించారు. జీవన ఎరువులు వినియోగిస్తే 10 శాతం ఎరువులు ఆదా చేయవచ్చని, జీవన ఎరువులతో పంటకు బలం చేకూరుతుందన్నారు. జీవన ఎరువులు (బయోఫర్టిలైజర్స్) వాడేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రసాయనిక ఎరువులు, కీటక నాశకాలతో కలిపి వేయకూడదని, నేలలో తగినంత తేమ ఉన్నప్పుడు వాడటం మంచిదని సూచించారు.

8 మంది బధిరులకు టచ్ ఫోన్లు పంపిణీ

వికలాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 8 మంది బధిరులకు టచ్ ఫోన్లను ఇన్‌చార్జ్ కలెక్టర్ పంపిణీ చేశారు. ఒక్కొక్కటి రూ.15వేల విలువైన టచ్ ఫోన్లను ఇంటర్ అర్హత కలిగిన 8 మంది బధిరులకు టచ్ ఫోన్లను అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్, డీఆర్ఓ మలోల, ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి రామకృష్ణారెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు తిప్పేనాయక్, ఆనంద్, రామ్మోహన్, మల్లికార్జునుడు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, వికలాంగుల శాఖ ఏడీ అర్చన, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

పనుల్లో పురోగతి కనిపించాలి

పెండింగ్ పనులను పూర్తి చేయాలి

ఇంజనీర్లతో సీఈ సమీక్ష



సమీక్షలో మాట్లాడుతున్న సీఈ

అనంతపురం న్యూటౌన్, జూలై 21(ఆంధ్రజ్యోతి): చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న త్వరితగతిన పూర్తి చేయాలని చీఫ్ ఇంజనీర్ అశోక్‌కుమార్ ఆదేశించారు. సోమవారం అనంతపురం, కర్నూలు జిల్లాలకు సంబంధించిన పీఐయూ ఇంజనీర్లతో పీఆర్ ఎస్ఈ కార్యాలయంలో సీఈ అశోక్‌కుమార్ సమీక్ష నిర్వహించారు. పీఐయూలో అమలు అవుతున్న ఏపీఆర్ఆర్‌పీ (ఆంధ్రప్రదేశ్ రూరల్ రోడ్స్ ప్రాజెక్టు)లో అమలు జరుగుతున్న ప్రాజెక్టులకు సంబంధించి ఒక్కొక్కటిగా సమీక్షించారు. 138 రోడ్లు అనుమతులు పొందగా రూ.209 కోట్లతో పనులు చేపట్టారు. ఇందులో 52 పనులు పూర్తి చేశారు. మరో 42 పనులు జరుగుతున్నాయి. 44 పనులకు సంబంధించి చాలా కాలంగా పురోగతి లేకపోవడంతో రద్దు చేశారు. రద్దు చేసిన వాటిని మార్చు చేసి వచ్చే ఏడాది మార్చి ఆఖరిలోపు పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటి వరకు పూర్తయిన వాటికి సంబంధించి రూ.101 కోట్లు ఖర్చు చేయగా.. 195.71 కిలోమీటర్ల పొడవుతో రోడ్ల నిర్మాణం చేపట్టారు. సత్యసాయి జిల్లాలో 230 రోడ్లకు సంబంధించి అనుమతులు పొందారు. రూ.194 కోట్లు కేటాయించారు. ఇందులో 119 పనులు పూర్తయ్యాయి. 28 పనులు నిర్మాణంలో ఉన్నాయి. 45 పనులు చాలా కాలంగా పెండింగ్ ఉండటంతో రద్దు చేశారు. పురోగతి లేని పనులను రద్దుచేసి, మార్చుచేసి వచ్చే ఏడాది మార్చిలోపు పూర్తి చేయాలని డెడ్‌లైన్ విధించారు. సమావేశంలో అనంతపురం ఇన్‌చార్జ్ ఎస్ఈ ప్రభాకర్‌రెడ్డి, ఈఎన్‌సీ కార్యాలయ ఈఈ రమణమూర్తి, సత్యసాయి జిల్లా ఈఈ శంకరయ్య, కర్నూలు ఈఈ వెంకటేష్, నంద్యాల ఈఈ రఘురామరెడ్డి, డీఈ లు నారాయణస్వామి, ఆనంద్‌బాబు, నాగేంద్రకుమార్, మదన్‌మోహన్, తిరుమలరెడ్డి, మధుప్రకాష్‌రెడ్డి, హనుమంతయ్య పాల్గొన్నారు.

14 మండలాల్లో వర్షం



అనంతపురం క్లాక్ టవర్ వద్ద కురుస్తున్న వర్షం

అనంతపురం అర్బన్, జూలై 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 14 మండలాల్లో ఆదివారం వర్షం కురిసింది. అత్యధికంగా యాడికిలో 32.4 మీ.మీ వర్షపాతం నమోదైంది. పెద్దపప్పూరు 21.2, గుంతకల్లు 17.2, శింగనమల 5.8, తాడిపత్రి 5.2, పుట్లూరు 4.4, వజ్రకరూరు 4.0 మీ.మీ వర్షం కురిసింది. మిగతా మండలాల్లో 2.2 మీ.మీలోపు వర్షపాతం నమోదైంది. సోమవారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో చిరుజల్లుల నుంచి ఓ మోస్తారు వర్షం కురిసింది. అనంతపురం నగరం, గుత్తిలో ఓ మోస్తారు వర్షం పడింది. బెళుగుప్ప, కళ్యాణదుర్గం, కూడేరు, ఉరవకొండ, శెట్టూరు, ఆత్మకూరు, పుట్లూరు, శింగనమల తదితర మండలాల్లో చిరుజల్లులు పడ్డాయి.

హనుమాన్ దర్శన్‌కు ప్రత్యేక బస్సులు

అనంతపురం టౌన్, జూలై 21(ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని రీజియన్‌లోని వివిధ డిపోల నుంచి హనుమాన్ దర్శన్ కోసం బస్సు సర్వీసులు నడపనున్నట్లు ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సుమంత్ ఆర్ ఆదోని సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతియేటా శ్రావణ మాసంలో ఒకే రోజు మూడు ఆంజనేయస్వామి దేవాలయాలను దర్శించుకునేలా కసాపురం, మురడి, నేమకల్లు క్షేత్రాలకు బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ఈనెల 26, 29, ఆగస్టు 2, 5, 9, 12, 16, 19వ తేదీల్లో బస్సు సర్వీసులు నడపుతామని అన్నారు. డిపోల వారీగా టికెట్ ధరలను నిర్ణయించామని పేర్కొన్నారు. ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం కూడా ఉందన్నారు.

బాల్ బ్యాడ్మింటన్ జిల్లా జట్ల ఎంపిక

- రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం



ఎంపికైన బాల్ బ్యాడ్మింటన్ బాల, బాలికల జట్లు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 21(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా స్థాయి బాల్ బ్యాడ్మింటన్ జట్లను ఎంపిక చేశారు. సోమవారం స్థానిక న్యూటౌన్ బాలుర జూనియర్ కళాశాలలో ఉమ్మడి జిల్లా స్థాయి జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఎంపికైన జట్ల వివరాలను జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వెంకటేశులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గౌస్ మొహిద్దీన్ ప్రకటించారు. సబ్‌జూనియర్ బాలుర విభాగంలో హర్షవర్ధన్‌రెడ్డి, మనోజ్, అశోక్‌బాబు, సాయిప్రసాద్, శివాజీ, సాయిచరణ్, రామ్‌చరణ్, ధనుష్, శివచరణ్, నవదీప్, జయవర్ధన్, అభిలాష్, భానుప్రసాద్, శేఖర్ ఎంపికయ్యారు. బాలికల జట్టులో....హిమబిందు, భవాని, జ్యోతిక, అంజలి, చంద్రకళ, అమృత, భార్గవి, ప్రణీత, ప్రణయ, సుచిత్ర, నిత్య, సాయిజోష్ణవి, నవ్యశ్రీ, జయశ్రీ, దివ్యశ్రీ, విద్యారెడ్డి ఎంపికయ్యారు. జూనియర్ బాలుర విభాగంలో మదన్, జిలాన్, నిఖిల్, చిరంజీవి, రాజశేఖర్, హర్షవర్ధన్, అల్తాఫ్, సుధీర్, జగదీష్, ఇబ్రహీం, ప్రదీప్, చందు, వినయ్, బాలాజీకి చోటు దక్కింది. బాలికల విభాగంలో వెంకటలక్ష్మి, గౌతమి, మానస, గౌతమిబాయి, అమృత, చరిత, మహేశ్వరి, మదీనా, కమలాక్షి, లోకేశ్వరిబాయి, విద్యారెడ్డి, సింధూజా, జశ్విత ఎంపికయ్యారు. సీనియర్ పురుషుల విభాగంలో వెంకటేశులు, ఇమామ్, షరీఫ్, నారాయణ స్వామి, అశోక్, అనిల్, సునిల్, హరికృష్ణ, శ్రీనాథ్, దుర్గాసాయి, రవికి చోటు దక్కింది. సీనియర్ మహిళల విభాగంలో ..పావని, గంగోత్రి, హేమ, అమృత, లక్ష్మీదేవి, హరిత, నిఖిల, గౌతమి, వందన, వినీల, సుస్మిత, భారతి, వెంకటలక్ష్మి, మహేశ్వరి ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులు ఆయా ప్రాంతాల్లో జరిగే రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు.

ఆంధ్రా సీనియర్ క్రికెట్ జట్టు

ప్రాబబుల్స్‌లో ఐదుగురికి చోటు



గిరినాథ్‌రెడ్డి వినయ్‌కుమార్ దత్తారెడ్డి అర్జున్ టెండూల్కర్ రాజుకుళ్లాయప్ప

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సీనియర్ రాష్ట్ర జట్టు ప్రాబబుల్స్‌లో జిల్లాకు చెందిన ఐదుగురు క్రీడాకారులకు చోటు దక్కింది. గిరినాథ్‌రెడ్డి, వినయ్‌కుమార్, ఎంకే దత్తారెడ్డి, అర్జున్ టెండూల్కర్, రాజుకు ళ్లాయప్ప ఆంధ్రా సీనియర్ పురుషుల వన్డే రాష్ట్ర జట్టు ప్రాబబుల్స్‌కు ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 23 నుంచి 26వ తేదీ వరకు విజయనగరంలో జరిగే పోటీలకు ప్రాతినిధ్యం వహించనున్నారు. క్రీడాకారులకు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి భీమలింగారెడ్డి అభినందనలు తెలిపారు.

బీజేపీ జిల్లా కమిటీ ఎంపిక

పుట్టపర్తిరూరల్, జూలై 21(ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ జిల్లా నూతన కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్ సోమవారం ప్రకటించారు. బీజేపీ జిల్లా అధికార ప్రతినిధిగా జ్యోతిప్రసాద్ (పుట్టపర్తి), జిల్లా ప్రధాన కార్యదర్శులుగా తలమర్ల హరికృష్ణ (పుట్టపర్తి), ఆమరా దేవేంద్ర (హిందూపురం), సాకే ఓబుళేసు (ధర్మవరం), జిల్లా ఉపాధ్యక్షులుగా కె.రాంమోహన్ (కదిరి), షేక్‌ముంతాజ్ (పెనుకొండ), తిరుమలేష్ (హిందూపురం), పురుషోత్తం (మడకశిర), జింకా రామాంజనేయులు (ధర్మవరం), కార్యదర్శులుగా డోలా రాజిరెడ్డి(ధర్మవరం), హనుమంతరెడ్డి (పుట్టపర్తి), రమ్య (పెనుకొండ), కుసుమ జయరాం (పుట్టపర్తి), టి. ఆనంద్, (కదిరి), వేణుగోపాల్ (పెనుకొండ), జిల్లా ఐటీ సెల్ కన్వీనర్‌గా వై. భాస్కర్ (పుట్టపర్తి), జిల్లా కోశాధికారి ముత్యాల సురేంద్రబాబు (పుట్టపర్తి)ను ఎంపిక చేశారు. నూతన కార్యవర్గం బీజేపీ అభివృద్ధి కోసం శక్తివంచన లేకుండా కృషి చేయాలని శేఖర్ పిలుపునిచ్చారు.

25 నుంచి ఆర్జిత కల్యాణోత్సవాలు

కదిరి, జూలై 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆర్జిత కల్యాణోత్సవాలు నిర్వహించనున్నట్లు ఈఓ శ్రీనివాసరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 25, 27, 30, 31, ఆగస్టు 3, 4, 5, 10, 11, 12, 13, 18, 19, 20, 21, 24, 25 తేదీల్లో ఆర్జీత కల్యాణోత్సవాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఒకరోజుకు ఐదు కళ్యాణం టిక్కెట్లు జారీ చేస్తామన్నారు. ఒక్కొక్క టిక్కెట్ ధర రూ.6,500 అన్నారు. ఒక టిక్కెట్‌పై ఐదుగురికి ప్రవేశం కల్పిస్తామని పేర్కొన్నారు.

అవినీతికి పాల్పడితే చర్యలు: డీఆర్వో

అనంతపురం కలెక్టరేట్, జూలై 21(ఆంధ్రజ్యోతి): చుక్కల భూములు, 22ఏ ఫైల్స్ పరిష్కరించే విషయంలో ఏ అధికారి అయినా అవినీతి పాల్పడితే విచారించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీఆర్వో మలోల సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ అధ్యక్షతన, జేసీ, డీఆర్ఓలు, సంబంధిత తహసీల్దార్ల సమక్షంలో జిల్లా స్థాయి సమావేశం నిర్వహించి సమస్యలు పరిష్కరిస్తామని అన్నారు. ఇప్పటి వరకు గత మూడు సమావేశాల్లో 163 చుక్కల భూములు, 22ఏ ఫైల్స్‌ను పరిశీలించామన్నారు. ఎప్పటికప్పుడు వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు.

జడ్పీలో కోల్డ్‌వార్..!

- గాడితప్పుతున్న పాలన
- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న ఎంపీడీఓలు
- శిక్షణకు వచ్చి కార్యవర్గ ఎన్నికల్లో నిమగ్నం
- చోద్యంచూస్తున్న అధికారులు



అనంతపురం న్యూటౌన్, జూలై 21(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ కార్యాలయంలోని ఉన్నతాధికారుల మధ్య కోల్డ్‌వార్ నడుస్తోందన్న చర్చ సాగుతోంది. సీఈఓ శివశంకర్, డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య మధ్య వివాదం ముదిరినట్లు జడ్పీ వర్గాలు చర్చించుకుంటున్నాయి. కడప జిల్లాలో డీఎల్‌డీఓగా పనిచేస్తున్న వెంకటసుబ్బయ్య డిప్యూటీ సీఈఓగా వచ్చారు. సీఈఓగా పనిచేస్తున్న రామచంద్రారెడ్డిని కొన్ని నెలల క్రితం ఉన్నఫలంగా బదిలీ చేయడంతో వెంకటసుబ్బయ్య కొన్నాళ్ల పాటు ఇన్‌చార్జిగా వ్యవహరించారు. తరువాత శివశంకర్‌ను సీఈఓగా నియమించినా, వెంకటసుబ్బయ్య అన్నీ తానై వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. ఇన్‌చార్జి సీఈఓగా పనిచేసని సమయంలో కొంతమంది ఎంపీడీఓలను కోటరీగా చేసుకుని, అంతా తానై వ్యవహరిస్తున్నారన్న చర్చ సాగుతోంది. ఈ నేపథ్యంలో సీఈఓను నియమించినా.. ఉన్నతాధికారి చేయాల్సిన పనుల్లో కూడా జోక్యం చేసుకుంటూ.. ఆయనను డమ్మీ చేస్తున్నారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇలా.. ఉన్నతాధికారుల మధ్య కోల్డ్‌వార్‌తో పాలన గాడితప్పుతోందన్న ప్రచారం జరుగుతోంది. వీరి వ్యవహారం తెలుసుకున్న కొంతమంది కింది స్థాయి సిబ్బంది కోటరీలుగా మారి ఎవరికి చెప్పాల్సినవి వారికి చెబుతూ.. పనులు చక్కదిద్దుకుంటున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి. అదే తరహాలోనే వసూళ్ల పర్వానికి శ్రీకారం చుట్టారన్న చర్చ సాగుతోంది.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంబ్...

దాశరథి (జయంతి)



పద్యాన్ని పదునైన ఆయుధంగా చేసుకుని తెలంగాణ విముక్తి కోసం ఉద్యమించిన 'కళాప్రపూర్ణ' పురస్కార గ్రహీత దాశరథి కృష్ణమాచార్య 1925 జూలై 22న వరంగల్ జిల్లా చిన్నగూడూరు గ్రామంలో జన్మించారు. 'నా తెలంగాణ కోటి రతనాల వీణ' అని గర్వంగా ప్రకటించి ఇప్పటి ఉద్యమానికి ప్రేరణ అందిస్తున్న కవి దాశరథి. తెలంగాణ ప్రజల కన్నీళ్ళను 'అగ్నిధార'గా మలిచి నిజాం పాలనపైకి ఎక్కుపెట్టిన మహాకవి దాశరథి. సంస్కృతం, ఆంగ్లం, ఉర్దూభాషల్లో మంచి పండితుడు. ఉపాధ్యాయుడిగా, పంచాయతీ ఇన్‌స్పెక్టర్‌గా, ఆకాశవాణి ప్రయోక్తగా ఉద్యోగాలు చేశారు. సాహిత్యంలో అనేక ప్రక్రియల్లో కృషి చేశారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, కవిసింహ, అభ్యుదయ కవితా చక్రవర్తి బిరుదులు పొందారు. 1987 నవంబరు 5న కన్నుమూశారు.

ముకేశ్‌చంద్ మాథూర్ (జయంతి)




హిందీ సినీ రంగంలో పేరొందిన ప్రముఖ నేపథ్య గాయకుడు ముకేశ్‌చంద్ మాథూర్ 1923 జూలై 22న ఢిల్లీలో జన్మించారు. కేఎల్ సైగల్ స్ఫూర్తితో పాటలు పాడడంలో తనదైన శైలిలో రాణించాడు. ఎక్కువ పాటలు శంకర్-జైకిషన్, కల్యాణ్‌జీ - ఆనంద్‌జీల సంగీత దర్శకత్వంలో పాడారు. రాజ్ కపూర్, మనోజ్‌కుమార్, దిలీప్‌కుమార్, సునిల్‌దత్ వంటి ప్రముఖ హీరోలకు పాటలు పాడారు. నేషనల్, ఫిల్మ్‌ఫేర్ అవార్డులు, బెంగాల్ ఫిల్మ్ జర్నలిస్టు అసోసియేషన్‌ల నుంచి ఉత్తమ నేపథ్య గాయకుడి అవార్డులు అందుకున్నారు. 1976 ఆగస్టు 27న అకస్మికంగా మృతి చెందారు.

డీకే జయరామన్ (జయంతి)



డీకేజేగా పేరొందిన 'సంగీత కళానిధి' గ్రహీత డీకే జయ రామన్ 1928 జూలై 22న కాంచీపురంలో జన్మించారు. తండ్రి, అక్కల ప్రోత్సాహంతో సాహిత్యం సంగీతంలో రాణించారు. ముత్తుస్వామి దీక్షితుల రచనలకు ప్రాచుర్యం కల్పించారు. కర్ణాటక సంగీతానికి వైభవం తెచ్చేందుకు కృషి చేశారు. 1991 జనవరి 18న కన్నుమూశారు.

అనంతకుమార్ (జయంతి)



హెగ్గనహళ్ళి నారాయణ శాస్త్రి అనంతకుమార్ 1959 జూలై 22న బెంగళూరులో జన్మించారు. బీజేపీలో సీనియర్ నేత. రెండు దశాబ్దాలపాటు బెంగళూరు దక్షిణ నుంచి ఎంపీగా కొనసాగారు. కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాలు, ఎరువులు, రసాయన శాఖ మంత్రిగా వ్యవహరించారు. ప్రజలకు తక్కువధరలో మందులు అందించే 'జన ఔషధి కేంద్రాల' ఏర్పాటులో ఎంతో కృషి చేశారు. సువిధ పథకం ద్వారా బయో డిగ్రేడబుల్, పర్యావరణ హిత శానిటరీ ప్యాడ్స్ అందుబాటులోకి తేవడంలో, అలాగే ఎరువుల పంపిణీలోనూ విప్లవాత్మక చర్యలు చేపట్టారు. ఆయన చేపట్టిన అదమ్య చేతన సంస్థ ద్వారా నేటికీ సామాజిక సేవలు కొనసాగుతున్నాయి. పదవిలో ఉండగా అకస్మాత్తుగా 2018 నవంబరు 12న కన్నుమూశారు.

కార్మికుల తొలగింపు అన్యాయం

● యూనియన్ అధ్యక్షుడు మల్లప్ప

రాయచూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వైటీపీఎస్ సమీపంలోగల అగ్నిమాపక కేంద్రంలో పని చేస్తున్న నలుగురు కార్మికులను అర్ధాంతరంగా పనులో నుంచి తొలగించడం అన్యాయమని కార్మిక సంఘం అధ్యక్షుడు మల్లప్ప అన్నారు. అధికారుల తీరును నిరశిస్తు కార్మికులతో కలిసి సోమవారం వైటీపీఎస్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన యూనియన్ అధ్యక్షుడు మల్లప్ప, గడచిన 9 ఏళ్లుగా ఇక్కడే సేవలందిస్తున్న నలుగురు ఉద్యోగులను ఎలాంటి కారణం చెప్పకుండా విధుల నుంచి తొలగించడం సరికాదన్నారు. అదే సందర్భంలో ఇద్దరు ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యక్తులను మరొక స్థానిక కార్మికుడిని పనులోకి తీసుకున్న అధికారులు పనులో నుంచి తీసివేసిన వారికి తీరని అన్యాయం చేశారని ఆరోపించారు. కాగా కార్మికులకు సక్రమంగా వేతనాలు కూడా ఇవ్వడం లేదని పైగా ప్రశ్నించిన వారిపట్ల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడం గర్హనీయమన్నారు. తమ సమస్యలు పరిష్కారం అయ్యే వరకు ధర్నాను కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

శని, మంగళవారాల్లో హనుమాన్ దర్శన్ సర్వీసు



పెనుకొండ, జూలై 21(ఆంధ్రజ్యోతి): శ్రావణమాసాన్ని పురస్కరించుకుని పెనుకొండ ఆర్టీసీ డిపోనుంచి ప్రతి శని, మంగళవారాలు హనుమాన్‌దర్శన్ పేరుతో బస్సు సర్వీసును ప్రారంభిస్తున్నట్లు డిపో మేనేజర్ రంగభాష్యం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఒకేరోజు మురడి, నేమకల్లు, కసాపురం ఆలయాలను దర్శించుకునేందుకు ఈ సర్వీసును ఏర్పాటుచేసినట్లు తెలిపారు. టికెట్ ధర ప్యాసింజర్ చెస్ కలుపుకుని రూ.660, పిల్లలకు రూ.330 నిర్ణయించడం జరిగిందన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, జూలై 21(ఆంధ్రజ్యోతి): శ్రీ సత్యసాయి జిల్లా గోరంట్ల మండలంలోని గుట్టిపల్లి గ్రామానికి చెందిన మహిళ సోమవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. భర్త మందలించడంతో మనస్థాపానికి గురై విష రసాయనం తాగింది. కుటుంబ సభ్యులు గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా డాక్టర్ వినోద్‌కుమార్ చికిత్స చేశారు. మెరుగైన వైద్యం కోసం 108లో హిందూపురం తరలించారు.

యథేచ్ఛగా మట్టి తరలింపు



రామచంద్ర రాయర చెరువులో మట్టిని తరలిస్తున్న దృశ్యం

బంగారపేట, జూలై 21(ఆంధ్రజ్యోతి): చెరువులలో మట్టి అక్రమ తవ్వకాలతో నీటి వనరుల స్వరూపాలు దెబ్బతింటున్నాయని, నీట సామర్థ్యం తగ్గుతోందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాలూకా వ్యాప్తంగా పలు చెరువులలో మట్టిని అక్రమంగా తవ్వేస్తున్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బూదికోటి రామచంద్ర రాయరకెరె (దొరకెరె), తదితర చెరువులలో మట్టిని అక్రమంగా తవ్వి ఇటుకల బట్టీకి, ప్రైవేట్ లే అవుట్‌ల నిర్మాణాలకు తోటలకు తరలిస్తున్నారు. పొరుగున ఉండే కేరళ రాష్ట్రానికి అక్రమంగా తరలించి విక్రయిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. చెరువులలో మట్టిని అక్రమంగా తవ్వడం ద్వారా పర్యావరణానికి హాని జరుగుతున్నా అధికారులు నిర్లక్ష్యంగా ఉన్నారని, ఇకనైనా గ్రామాల జల మూలాలను, భూగర్భ జలాలు కాపాడాలని దళిత సమాజసేన రాష్ట్ర అధ్యక్షుడు సూలికుంటె ఆనంద్ డిమాండ్ చేశారు. దళిత రైతుసేన రాష్ట్ర అధ్యక్షుడు హుణసనహళ్ళి వెంకటేశ్ మాట్లాడుతూ చెరువులలో మట్టిని అక్రమంగా తవ్వుతున్నవారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతుసంఘం అధ్యక్షుడు మునికృష్ణప్ప మాట్లాడుతూ వారాంతంలో అధికారులు ఎవరూ అందుబాటులో ఉండడం లేదనే ఉద్దేశ్యంతో అక్రమార్కులు యథేచ్ఛగా మట్టిని తవ్వుతున్నారని, ఈ అంశంపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు.

అంతర్జాతీయ సాంకేతిక నిపుణులతో బెంగళూరు టెక్ సమ్మిట్



టెక్ సమ్మిట్ సన్నాహకసభలో ఐటీబీటీ శాఖల ప్రిన్సిపల్ సెక్రటరీ ఏక్‌రూప్‌కౌర్ తదితరులు

బెంగళూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి): గ్లోబల్ టెక్ భాగస్వాముల ఆకర్షణకోసం అంతర్జాతీయ స్థాయి సాంకేతిక నిపుణులను భాగస్వాములను చేసేలా బెంగళూరు టెక్ సమ్మిట్ (బీటీఎస్) 2025 నిర్వహించనున్నట్టు రాష్ట్ర ఐటీబీటీ శాఖల ప్రిన్సిపల్ సెక్రటరీ ఏక్‌రూప్‌కౌర్ అభిప్రాయపడ్డారు. సోమవారం బీటీఎస్ సన్నాహకసభ జరిగింది. రాష్ట్రప్రభుత్వం ఐటీ బీటీ శాఖల ద్వారా గ్లోబల్ ఇన్నోవేషన్ అలయెన్స్‌లో భాగంగా బెంగళూరు టెక్ సమ్మిట్ నిర్వహిస్తోందన్నారు. భాగస్వామ్య దేశాలు, అంతర్జాతీయ వాణిజ్య మిషన్ ప్రతినిధులు భాగస్వాములు కావడం సంతోషకరమన్నారు. యూకే, ఆస్ట్రేలియా, జపాన్, జర్మనీ, అమెరికా, ఫ్రాన్స్, నెదర్లాండ్, సింగపూర్, ఇజ్రాయెల్, ఇటలీ, వియత్నాంతోపాటు అంతర్జాతీయ ఏజెన్సీలు, కాన్సులేట్ జనరల్స్‌లు భాగస్వాములయ్యారు. 2018లో గ్లోబల్ ఇన్నోవేషన్ అలయెన్స్‌లో 10దేశాల భాగస్వామ్యం ఉండేదని, ప్రస్తుతం 35దేశాలకు విస్తరించామన్నారు. నవంబరు 18 నుంచి 20వరకు బెంగళూరు ఇంటర్నేషనల్ ఎగ్జిబిషన్ సెంటర్ (బీఐఈసీ) లో సమ్మిట్ జరగనుందన్నారు. సమావేశంలో కర్ణాటక ఇన్నోవేషన్ టెక్నాలజీ సొసైటీ (కేఐటీఎస్) ఎండీ రాహుల్ శరణప్ప సంకనూరు, ఐటీ బీటీ విభాగం డిప్యూటి సెక్రటరీ దల్‌జిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

26న దొడ్డణ్ణస్వామి ఆరాధనా మహోత్సవం



దొడ్డణ్ణస్వామి

ముళబాగిలు, జూలై 21(ఆంధ్రజ్యోతి): బెంగళూరు కేఆర్ మార్కెట్ ప్రాంతం కోటె సమీపాన గల లక్ష్మీనరసింహస్వామి ధర్మసంస్థ ఆవరణలో సంస్థ సంస్థాపకులు జనోపకారి దొడ్డణ్ణస్వామి 104వ వార్షిక ఆరాధన మహోత్సవం ఈనెల 26న జరగనుంది. ఇందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు సంస్థ అధ్యక్షుడు ఎస్ సురేశ్, ఉత్సవ సమితి అధ్యక్షుడు మునిశెట్టి తెలిపారు. జ్యోతినగర్ వైశ్యగాణిగ సామాజికవర్గం హాస్టల్, కళాశాల పూర్వ విద్యార్థులు పాల్గొనాలని కోరారు. దొడ్డణ్ణస్వామికి మైసూరు నాల్వడి కృష్ణరాజ ఒడెయార్‌చే 'జనోపకారి' బిరుదు పొందారన్నారు. విద్యాసంస్థ, హాస్టల్ ద్వారా విద్యాదానం, అన్నదానం చేయడంతో లక్షలాదిమంది విద్యార్థుల పాలిట దేవుడయ్యాడన్నారు. ప్రతి సంవత్సరం ఆయనను స్మరించే ఆరాధనా మహోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 26న ఉదయం ధర్మసంస్థ సంస్థాపక దాత దొడ్డణ్ణశెట్టి ఇంటిదైవం లక్ష్మీనరసింహస్వామికి అభిషేకం, పూజలు ఉంటాయన్నారు. అనంతరం దొడ్డణ్ణస్వామి సమాధికి కూడా బంధువులచే పూజలు కొనసాగుతాయన్నారు. అనంతరం వైశ్య గాణిగ సామాజిక విద్యార్థులు ఎస్ఎస్ఎల్‌సీ, పీయూసీలలో అత్యధిక మార్కులు సాధించినవారికి ప్రతిభా పురస్కారాల ప్రదానం ఉంటుందన్నారు. బెంగళూరు దక్షిణ ఎంపీ తేజస్విసూర్య, చిక్కపేట ఎమ్మెల్యే ఉదయ్ గరుడాచార్, ఎమ్మెల్యే శరత్ బచ్చేగౌడ సంఘం పదాధికారులు తదితరులు ముఖ్య అతిథులుగా విచ్చేస్తారన్నారు.

ఏపీఎంసీ మార్కెట్‌లో మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యం



తహసీల్దార్ మనిషా మహేశ్ ఎన్ పత్రి

బాగేపల్లి, జూలై 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఏపీఎంసీ మార్కెట్‌లో మౌలిక సదుపాయాలు కల్పించడానికి ప్రాధాన్యత ఇవ్వాలని, దళారీలకు కమిషన్ తప్పించేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ మనిషా మహేశ్ ఎన్ పత్రి సూచించారు. పట్టణంలో సోమవారం మీడియాతో మాట్లాడుతూ అధికారులు, దళారీలు, రైతులతో సమావేశం అనంతరం మాట్లాడుతూ ఎన్నో నెలలుగా మార్కెట్‌లో స్వచ్ఛత పాటించాలని, తాగునీరు, శౌచాలయం, వీధిదీపాలు అమరిక, దళారులకు అడ్డుకట్ట వేయాలని అధికారులను సూచించామన్నారు. మార్కెట్‌లో ఉదయం నుంచి మధ్యాహ్నం 1 వరకు టమోటా, అనంతరం 2 నుంచి రాత్రి వరకు కూరగాయలు విక్రయించాలని నిర్ణయించామన్నారు. మార్కెట్‌కు వచ్చేందుకు వెళ్లేందుకు వేర్వేరుగా గేట్‌లు ఉన్నాయని, ప్రవేశద్వారం వద్ద సిబ్బందిని ఒకరిని నియమించి సజావుగా వెళ్లేలా చర్యలు చేపడతామన్నారు. ఏపీఎంసీ మార్కెట్ ముందు ఎంతోమంది చిల్లర వ్యాపారులు తమ వ్యాపారాలు నిర్వహిస్తున్నారని వారికి త్వరలోనే మరోస్థలం కేటాయిస్తామన్నారు. రైతుసంఘం తాలూకా అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే



గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బీఎం నాగరాజు

సిరుగుప్ప, జూలై 21(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బీఎం నాగరాజు తెలిపారు. సోమవారం తాలుకాలోని ఎం సూగూరు గ్రామంలో రూ. 20 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రంథాలయాన్ని ప్రారంభించారు. ప్రతి ఒక్కరు పుస్తకాలు, పత్రికలు చదివే అలవాటు ఏర్పాటు చేసుకోవాలని గ్రామ ప్రజలకు సూచించారు. అనంతరం తాలుకాలోని ఆదర్శ విశ్వవిద్యాలయ పాఠశాల వద్ద బీసీఎం హాస్టల్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ శాఖ డైరెక్టర్ మల్లికార్జున, పార్టీ అధ్యక్షులు కరిబసప్ప, గ్రామ పంచాయతీ అధ్యక్షులు, సర్వసభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న కారు

హిందూపురం, జూలై 21(ఆంధ్రజ్యోతి): హిందూపురం మున్సిపాలిటీ పరిధిలోని కొట్నూరు చెరువుకట్ట మరువవద్ద ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలైనట్లు పోలీసులుతెలిపారు. పెనుకొండకు చెందిన ఉపాధ్యాయుడు నాగరాజు, బుక్కపట్నంకు చెందిన సీననాయక్ సోమవారం సాయంత్రం ద్విచక్రవాహనంలో హిందూపురానికి వస్తున్నారు. అదే సమయంలో హిందూపురం నుంచి పెనుకొండకు వెళ్తున్న కారు ఢీకొంది. వీరికి తీవ్రగాయాలయ్యాయి. వీరిని వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సలందించారు.

బొలెరోకు నిప్పు

గోరంట్ల, జూలై 21(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల పట్టణంలోని కదిరి ప్రధాన రహదారిలో సాయి పెట్రోల్ బంక్ వద్ద సప్లయర్స్ దుకాణం ముందు ఉంచిన బొలేరో వాహనానికి గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి నిప్పుపెట్టినట్లు బాధితుడు మునిస్వామి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కారకులపై చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

పత్తి వైపు రైతన్న చూపు

వరుస నష్టాలతో వేరుశనగ సాగుపై నిరాసక్తత



ఆశాజనకంగా పత్తిపంట

మడకశిర రూరల్, జూలై 21(ఆంధ్రజ్యోతి): పత్తి పంటపై రైతులు మొగ్గుచూపుతున్నారు. సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ప్రతి యేడు వర్షాలు బాగా తగ్గుతుండంతో వేరుశన పంటసాగుకు విముఖత చూపుతున్నారు. దీంతో వేరుశనగ సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గుతోంది. ప్రతి సంవత్సరం సాగు చేయడం వర్షాలు సరిగా కురవకపోవడంతో నష్టాలు వస్తుండటంతో రైతులు వేరుశనగ సాగుకు ఆసక్తి చూపడంలేదు. ఈ ఏడు వర్షాలు కురుస్తాయన్న ఆశతో ఎదురుచూశారు. అయితే వారికి నిరాశే ఎదురైంది. దీంతో చేసేదిలేక ప్రత్యామ్నాయ పంటలవైపు దృష్టిసారిస్తున్నారు. అందులోభాగంగా పత్తిపంట సాగుకు ఆసక్తి చూపుతున్నారు. మండలంలో ఇప్పటి వరకు 800 మంది రైతులు 900 ఎకారాల్లో వేరుశనగకు ప్రత్యామ్నాయంగా పత్తి పంటను సాగుచేశారు. 600 మంది రైతులు 300 ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగుచేశారు పంటలు సైతం ఆశాజనకంగా ఉన్నాయని రైతులు అంటున్నారు. ఈనెల 31 వరకు వేరుశనగను విత్తుకోవచ్చని వ్యవసాయశాఖ అధికారి తిమ్మప్ప అన్నారు. అది వీలుకానిపక్షంలో ప్రత్యామ్నాయ పంటలు పత్తి, మొక్కజొన్న, కంది సాగుచేసుకోవచ్చని సూచించారు.

సోలార్ విద్యుత్ స్తంభాల ఏర్పాటుపై రైతుల నిరసన

రాయచూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని సింధనూరు తాలూకా జవళగేరా సమీపంలో ఏర్పాటు చేస్తున్న సోలార్ విద్యుత్ ప్లాంట్ స్తంభాలతో రైతులకు ఇబ్బందులు మొదలైయ్యాయి. జవళగేరా క్లస్టర్‌లోని సుల్తాన్‌పూర్ శివారులో స్తంబాలు పాతుతున్న సందర్భంగా రైతులు అభ్యంతరం చేయడంతో పోలీసులు రంగప్రవేశం చేశారు. తాము కోరిన విధంగా నష్టపరిహారం ఇవ్వకుండా ప్రైవేటు యాజమాన్యంలోని సోలార్ పవర్ ప్లాంట్ ఇష్టారీతిన స్తంబాలు వేస్తుండడం వల్ల సాగుపొలాలు ధ్వంసమవుతున్న రైతులు ఆరోపించారు. ఈ సందర్భంగా రైతులకు పోలీసులకు కొంత వాగ్వాదం చోటు చేసుకోగా తమకు నష్ట పరిహారం చెల్లించి స్తంబాలు ఏర్పాటు చేయాలని రైతులు ఖరాఖండిగా తేల్చిచెప్పారు. ఈ సందర్భంగా మాట్లాడిన రైతు సంఘం నాయకుడు బసవరాజ్ గుడిహాళ, విద్యుత్ స్తంబాల ఏర్పాటు వల్ల రైతులకు జరుగుతున్న నష్టాన్ని అంచనా వేయడంలో అధికారులు పూర్తిగా విఫలమైయ్యారన్నారు. స్తంభం నుంచి స్తంభం మధ్య వైరు ఉన్న చోట రైతులు తమ వ్యక్తిగత ప్రైవేటు వ్యవహారాలు నిర్వహించుకునే అవకాశం ఉండదన్నారు. దీంతో పెద్ద ఎత్తున సాగుభూమిని కోల్పోయే ప్రమాదం ఉందని ఈ దశలో రైతులు ప్రతి చదరపు అడుగుకు 2500 రూపాయిలు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నందున అధికారులు ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించాలన్నారు.



పహరా కాస్తున్న పోలీసులు, పొలాల్లో విద్యుత్ స్తంభాలు

విద్యార్థులకు ఉచిత హృద్రోగ పరీక్షలు



ప్రత్యేక కార్యక్రమంలో వైద్యులు, చిన్నారులు

దొమ్మసంద్ర, జూలై 21(ఆంధ్రజ్యోతి): ఆనేకల్ తాలూకాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా హృద్రోగ పరీక్షలు చేస్తున్నట్టు స్పందన సూపర్ స్పెషాలిటి ఆసుపత్రి ఎండీ డాక్టర్ ప్రవీణ్ తెలిపారు. ఇటీవలి రోజుల్లో హాసన్ జిల్లాలో పలు గ్రామాలలో పాఠశాల, కళాశాల విద్యార్థులు హార్ట్ అట్యాక్‌తో మృతి చెందారన్నారు. ఆసుపత్రి మూడో వార్షికోత్సవం సందర్భంగా తాలూకా పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. సర్జాపుర హోబళి సోంపుర గేట్ వద్ద ఆసుపత్రి ఉందన్నారు. ఆసుపత్రి అధ్యక్షుడు ప్రసన్నరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ సహకారంతో హార్ట్ క్లీనింగ్ ప్రోగ్రామ్ కింద కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. తాలూకాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 25వేల మంది విద్యార్థులకు హార్ట్‌చెకప్ చేయనున్నట్టు తెలిపారు. కాగా తాలూకాలో యశస్విని పథకం కల్గిన ఆసుపత్రి తమదేనని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నారాయణ హెల్త్‌కేర్ డైరెక్టర్ డాక్టర్ తిమ్మప్ప హెగ్డే, డాక్టర్ మధుసూధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభా పురస్కారాలు ప్రదానం



ప్రతిభా పురస్కారాలతో విద్యార్థులు

శిడ్లఘట్ట, జూలై 21(ఆంధ్రజ్యోతి): కన్నడ సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో 2024-25 సంవత్సరానికి కన్నడ మాతృభాషలో 100కు వంద మార్కులు సాధించిన ఎస్ఎస్ఎల్‌సీ, పీయూసీ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేశారు. పట్టణంలోని నగరేశ్వర కల్యాణమండపంలో ఏర్పాటైన కార్యక్రమంలో 73మందికి కన్నడ నిఘుంటువు, జ్ఞాపికలు అందచేశారు. కన్నడ సాహిత్య పరిషత్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కోడి రంగప్ప మాట్లాడుతూ సరిహద్దు ప్రాంతాలలో పరభాషలతోపాటు ఆంగ్లంపై వ్యామోహంతో ఉన్న తరుణంలో కన్నడ భాషపై వందశాతం మార్కులు సాధించడంపై విద్యార్థులను అభినందించారు. ఉన్నత విద్యలోనూ తమ లక్ష్యాలను అందుకుని పురోగతి సాధించాలని సూచించారు. కర్ణాటక వచన సాహిత్య పరిషత్ సంస్థాపకులు ఎంవీ తాగ్యరాజ్ మాట్లాడుతూ తల్లిదండ్రులతో పాటు గురువులను గౌరవించాలని సూచించారు. కార్యక్రమానికి కసాప తాలూకా అధ్యక్షుడు పటేల్ నారాయణస్వామి, మాజీ అధ్యక్షుడు రూపసి రమేశ్, రైతు సంఘం బెళ్ళూటి మునికెంపణ్ణ తదితరులు పాల్గొన్నారు.

యరగేరాను తాలూకా కేంద్రం చేయండి



ఫ్రీడంపార్కు నిరసనలో యరగేరా వాసులు

బెంగళూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి): రాయచూరు జిల్లాలోని యరగేరా హోబళిని తాలూకా కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ తాలూకా పోరాట సమితి ఆధ్వర్యంలో నగరంలోని ఫ్రీడంపార్కులో సోమవారం ధర్నా చేపట్టారు. యరగేరా హోబళిలో ప్రస్తుతం 78 గ్రామాలు ఉన్నాయని, ఆదికవి మహర్షి వాల్మీకి విశ్వవిద్యాలయం, ఉప తహసీల్దార్ కార్యాలయాలు 2, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కార్యాలయాలు 2, గ్రామ పాలపాధికారుల కార్యాలయాలు 40, పోలీస్‌స్టేషన్‌లు 2, రైతుకేంద్రాలు 2, గ్రంథాలయాలు 19, పశువైద్య ఆసుపత్రిలు 8, జాతీయ బ్యాంకులు 6, సహకార బ్యాంకులు 19, పోస్టాఫీస్‌లు 8 ఉన్నాయని పోరాట సమితి ప్రధాన సంచాలకులు మహ్మద్ నిజాముద్దీన్, సం చాలకులు బసవరాజ హరాగార తెలిపారు. తాలూకా కేంద్రంగా అన్ని అర్హతలు ఉన్నాయని ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు విన్నవిస్తామన్నారు.

ఇరు వర్గాల ఘర్షణ



దగ్ధమైన స్కూటీ

రాయచూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి) : నగరంలోని తిమ్మారోపేట బ్రేస్తవార్ పేటకు చెందిన యువకులు పరస్పరం జరుపుకున్న దాడుల్లో స్కూటీ ఒకటి దగ్ధమైంది. ఈ సంఘటన ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకోగా నేతాజినగర్ పోలీసులు బాధ్యులైన ఇద్దరు యువకుల పై కేసు నమోదు చేశారు. రెండు కాలనీలకు చెందిన యువకుల మధ్య మాటమాట పెరిగి ఒకరి పై ఒకరు దాడికి దిగారు. ఈ క్రమంలో కృష్ణ అనే యువకుడికి చెందిన స్కూటీ అక్కడే ఉండగా దాన్ని ధ్వంసం చేసిన ప్రత్యర్థులు నిప్పంటించి అక్కడి నుంచి పరారయ్యారు. బాధితులిచ్చిన ఫిర్యాదు మేరకు నేతాజినగర్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఎక్స్‌కవేటర్ కిందపడి కార్మికుడి మృతి

రాయచూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి): రాయచూరు తాలూకాలోని చిక్క సుగూరు గ్రామ సమీపంలో ప్రైవేటు ఇండస్ట్రీకి చెందిన ఎక్స్‌కవేటర్ యంత్రం ఒకటి ఎక్కడంతో అక్కడ పని చేస్తున్న కార్మికుడు మృత్యువాత పడ్డాడు. ఈ సంఘటన ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకోగా మృతుడు ఉత్తర్ ప్రదేశకు చెందిన మున్న(30)గా కార్మికులు తెలిపారు. ఎక్స్‌వేటర్ యంత్రం నడుపుతున్న డ్రైవర్ తాగిన మత్తులో ఉండడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు తోటి కార్మికులు ఆరోపిస్తున్నారు. కార్మికుడి చావుకు కంపెనీ యాజమాన్యం బాధ్యతవహించి కుటుంబానికి పరిహారం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1625.96	1,624.41
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	36,813	1,12,101
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	39,228	2,324
నీటి నిల్వ (టీఎంసీలు)	79.67	74.58

కక్ష సాధింపు కొరకే కేంద్ర దర్యాప్తు సంస్థలు

● కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ఇబ్బంది పెడుతున్న బీజేపీ ● శ్రీరాములుకూ జైలు తప్పదు ● నేనూ సీఎం కావచ్చు : మాజీ మంత్రి నాగేంద్ర



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి నాగేంద్ర

బళ్లారి, జూలై 21(ఆంధ్రజ్యోతి): బీజేపీ కేంద్ర దర్యాప్తు సంస్థలను అడ్డుపెట్టుకుని కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై కక్ష సాధిస్తోందని, రాబోయే రోజుల్లో మాజీ మంత్రి శ్రీరాములు కూడా జైలుకు వెళ్లాల్సి రావచ్చని మాజీ మంత్రి, బళ్లారి గ్రామీణ ఎమ్మెల్యే నాగేంద్ర ధ్వజమెత్తారు. సోమవారం బళ్లారిలో నాగేంద్ర విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీజేపీ నాయకుడు శ్రీరాములు అసత్య ఆరోపణలు చేస్తున్నారని, ఎస్టీ నిగమ మండలిలో అవినీతిలో తనకు ఏమాత్రం తెలియదన్నారు. అయినా మండలి బ్యాంకు ఖాతా నుంచి ఏబ్యాంకు ద్వారా ఎవరికి నగదు బదిలీ అయ్యిందో విచారణ చేపట్టి, తిరిగి మొత్తాన్ని ఆదే బ్యాంకు ఖాతాకు జమచేశామన్నారు. రాబోయే రోజుల్లో శ్రీరాములు కూడా జైలుకు వెళ్లేరోజులు రావచ్చన్నారు. కోవిడ్ సందర్భంగా కిట్లు కొనుగోళ్లలో పెద్దఎత్తున అవినీతి జరిగిందని, ఆ కేసులో ఆయన శిక్ష అనుభవించక తప్పదన్నారు. బళ్లారిలో ఆయనొక్కరే ఉండాలన్న అహంకారం పనికి రాదన్నారు. ప్రజలు తనకు అండగా ఉన్నారని వచ్చే 20 ఏళ్లలో తాను ముఖ్యమంత్రి కూడా కావచ్చన్నారు 2028లో జరిగే ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

ఏపీఎంసీలో సకల సౌకర్యాలు

● పంట నిల్వలకు అధునాతనమైన షెడ్లు
● రూ.22కోట్లతో రోడ్లు, డ్రైనేజీ కాల్వలు
: అధ్యక్షుడు కట్టేమని నాగేంద్ర



బళ్లారి, జూలై 21(ఆంధ్రజ్యోతి): బళ్లారి ఏపీఎంసీ మార్కెట్ యార్డులో రైతులు, వ్యాపారులకు అన్ని వసతులు కల్పించామని, సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎంసీ అధ్యక్షుడు కట్టేమని నాగేంద్ర తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మార్కెట్ నుంచి వచ్చే ఆదాయం, నాబార్డు నిధులతో మార్కెట్ లో అనేక అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. నగర ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, మాజీ మంత్రి బి. నాగేంద్ర, కంప్లి ఎమ్మెల్యే గణేష్ సహకారం, కమిటీ సభ్యుల ప్రోత్సాహంతో మార్కెట్ యార్డు అభివృద్ధి చెందుతోందన్నారు. 2024-25ఏడాది మార్కెట్ యార్డు ఆదాయం ఇప్పటికే సుమారు రూ. 10 కోట్లు వచ్చిందన్నారు. యార్డు బ్యాంకు బ్యాలెన్సులో రూ. 13 కోట్ల 77 లక్షల 34 వేల 905 ఉందన్నారు. రైతుల నుంచి కేవలం 0.6పై సాలు మాత్రమే పన్ను వసూలు చేస్తున్నామన్నారు. గతంలో రూ. 1.5 పైసలు పన్ను ఉండేదని ప్రస్తుతం రూ. 0.6 శాతానికి తగ్గించామన్నారు. కూరగాయలు, పండ్ల మార్కెట్ నుంచి ఈఏడాది రూ.40 నుంచి రూ.50 లక్షల ఆదాయం వచ్చిందన్నారు. మార్కెట్‌కు పండ్లు, కూరగాయలు తెచ్చే రైతుల నుంచి వ్యాపారులు అదనంగా వసూళ్లు చేయకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఏపీఎంసీలో మరిన్ని అభివృద్ధి పనులు చేపడ్తామని ఆయన అన్నారు.

మిర్చియార్డు ఏర్పాటుకు సర్వం సిద్ధం

బళ్లారి రూరల్ పరిధిలో అల్‌దళ్లి ఏరియాలో 24 ఎకరాల విస్తీరణంలో రూ. 3వేల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థంతో ఏసీ గోదామును నిర్మించేందుకు టెండర్ ప్రక్రియ పూర్తీ అయినట్లు ఆయన తెలిపారు. ఇందుకు నగర ఎమ్మెల్యే నారాభరత్‌రెడ్డి, మాజీ మంత్రి బి. నాగేంద్ర, కంప్లి ఎమ్మెల్యే గణేష్, ఇతర కమిటీ సభ్యులు, అధికారులు సహకరిస్తున్నారని అన్నారు. ప్రస్తుతం రూ.11 కోట్లకు పైగా నిధులతో గోదాము నిర్మిస్తున్నామన్నారు.



పనులను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

ఉపాధి హామీ పనుల పరిశీలన

బళ్లారి గాంధీనగర్, జూలై 21(ఆంధ్రజ్యోతి): కురుగోడు తాలూకా కోళూరు, ఓర్వాయి గ్రామ పంచాయతీల్లో కేంద్ర మానిటరింగ్(ఎన్ఎల్ఎం) అధికారుల బృందం పర్యటించింది. డాక్టర్ దయాకర్ రెడ్డి, చూడామణి రెడ్డి బృందం సోమవారం నరేగా పనులను పరిశీలించారు. కోళూరు గ్రామ పంచాయతీలో నరేగా యోజనలో గత మూడేళ్ళ సామగ్రి ఆధారిత పనులను, గ్రామ పంచాయతీ కట్టడాలు, ఎన్ఆర్ఎల్ఎన్ శెడ్, మెటల్ రోడ్లు, పశువుల పాకల నిర్మాణాలను పరిశీలించారు. ప్రధానమంత్రి శ్రీ ఆవాజ్ యోజనలో నిర్మాణ దశలో ఉన్న ఇళ్ళు, నరేగా పథకంలో కాలువల్లో పేరుకుపోయిన పూడిక తొలగింపు పనులు, సామాజిక అటవీ విభాగం ఆధ్వర్యంలో చెట్లనాటే కార్యక్రమాలు, ఉద్యాన వన శాఖ ఆధ్వర్యంలో జరిగిన దానిమ్మ, ప్రధాన మంత్రి సడక్ యోజనలో మదిరి గ్రామం నుంచి వద్దటి గ్రామం వరకు చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులతో పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం కూలీలు, లబ్దిదారులతో చర్చలు జరిపి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామ లెక్కాధికారుల చర్చల అనంతరం గ్రామంలో దివ్యాంగులు, వృద్ధులు, వింతంతువులకు అందుతున్న పెన్షన్ల పంపిణీలకు సంబంధించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇదే సందర్భంలో సందర్భంగా కురుగోడు తాలూకా పంచాయతీ స్వసహాయ సంఘం నిర్వహిస్తున్న కార్యక్రమాల గురించి సంఘం ప్రతినిధులతో చర్చజలు జరిపారు. కార్యక్రమంలో కురుగోడు తాలూకా పంచాయతీ కార్యనిర్వహణ అధికారి కేవీ నిర్మల, తాలూకా పంచాయతీ అసిస్టెంట్ డైరెక్టర్ పి.శివరామరెడ్డి, గ్రామ పంచాయతీ అభివృద్ధి అధికారి జుబేద, తిమ్మప్ప, గ్రామ లెక్కాధికారి మారుతి, ఉద్యాన వన శాఖ అధికారులు రాఘవేంద్ర, కిరణ్, సామాజిక అటవీ శాఖ అధికారి సిరా బడీగ, కురుగోడు తాలూకా పంచాయతీ ఐఈసీ కో ఆర్డినేరట్ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం, జొన్నలు స్వాధీనం



బియ్యం, జొన్నలను చూపుతున్న అధికారులు

బళ్లారి రూరల్, జూలై 21(ఆంధ్రజ్యోతి): అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం, జొన్నలను సోమవారం అధికారులు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ శోభారాణి, అడిషనల్ ఎస్పీ రవి కుమార్ ఆదేశాలతో బళ్లారి తాలుకాలోని సంగనకల్లు గ్రామ శివార్లలో రూరల్ ఫుడ్ ఆఫీసర్ మంజునాథ్, రూరల్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ సతీష్ దాడులు నిర్వహించారు. 282 బస్తాల బియ్యం 98 బస్తాల జొన్నలు స్వాధీనం చేసుకున్నామని, విలువ రూ.4,22,610 ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు వారు తెలిపారు.

జొన్న కొనుగోలు సొమ్ము విడుదల చేయాలి

● కన్నడ నాడు రైతు సంఘం డిమాండ్



ఏడీసీకి వినతి పత్రం అందజేస్తున్న కన్నడ నాడు రైతు సంఘం నాయకులు

బళ్లారి సిటీ, జూలై 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొనుగోలు కేంద్రాల్లో రైతుల వద్ద నుంచి సేకరించిన జొన్నల సొమ్మును వెంటనే రైతుల ఖాతాల్లో వేయాలని కన్నడ నాడు రైతు సంఘం డిమాండ్ చేసింది. అన్ని జిల్లాలు, తాలూకాల్లో మార్చి నెలలో ప్రభుత్వం మద్దతు ధరతో జొన్నలు సేకరించింది. కానీ ఇంతవరకు రైతుల ఖాతాల్లో నగదు జమకాలేదు. దీనిపై ఏడీసీకి రైతు సంఘం నాయకులు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు ఈశ్వరప్ప మెణిసిన మాట్లాడుతూ వర్షకాలం వ్యవసాయ సీజన్ ఇప్పటికే ప్రారంభం అయ్యిందని, కాలువలకు నీరు వచ్చింది. వ్యవసాయ పనులు జోరుగా జరుగుతున్నాయన్నారు. అంతేకాక రైతులు విత్తనాలు, ఎరువుల కొనుగోలు చేయాల్సి ఉందన్నారు. డబ్బును చెల్లించకపోతే రాష్ట్రంలోని రైతులు ఉగ్రపోరాటం చేపడుతారన్నారు. కన్నడ నాడు రైతు సంఘం ఆఫీస్ బేరర్లు రమేశ్‌గౌడ, దొడ్డ బసవనగౌడ, శివకుమార్‌గౌడ,వీరభద్రగౌడ, రాజశేఖర్, మల్లనగౌడ, మేటి సురేశ్‌గౌడ, దివాకర్‌గౌడ, మల్లికార్జున,హనుమంతప్పగౌడ, ప్రశాంత్‌స్వామి, బెల్లం రెడ్డి, బసవనగౌడ, శివరాంరెడ్డి, చెన్నారెడ్డి రైతులు పాల్గొన్నారు.

చదువుతో ఎక్కడైనా రాణించవచ్చు: ఎస్పీ



విద్యార్థులను అభినందిస్తున్న ఎస్పీ డాక్టర్ శోభారాణి

కంప్లి, జూలై 21(ఆంధ్రజ్యోతి): సమాజంలో అన్నిటికన్నా విద్య ఎంతో గొప్పదని, చదువుతో ప్రపంచంలో ఎక్కడైనా రాణించవచ్చని జిల్లా ఎస్పీ డాక్టర్ శోభారాణి అన్నారు. జిల్లా పరిధిలోని సిరిగేరి గ్రామంలో సోమవారం నాగనాథేశ్వరాలయం ప్రాంగణంలో 'మీకోసం మేము' సంస్థ ఆధ్వర్యంలో 2024-25లో పదవ తరగతి, ఇంటర్మీడియట్ ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను సన్మానించారు. ముఖ్య అతిథిగా హాజరయిన ఎస్పీ శోభారాణి మాట్లాడుతూ చదువుతో ప్రపంచంలో ఎక్కడైనా రాణించవచ్చన్నారు. విద్యార్థులను ప్రోత్సహిస్తున్న మీ కోసం మేము సంస్థను ఆమె ప్రత్యేకంగా అభినందించారు. జిల్లా అధ్యక్షులు వినయ్‌కుమార్, గ్రామ పంచాయతీ అధ్యక్షులు హోలగుంద, లక్ష్మీ పీడీవో రామప్ప, సీఐ చందన, గోపాల్ డ్రైవర్, హులిగప్ప, భీమలింగప్ప, అడవయ్య స్వామి, రుద్రగౌడ, గోడే శివరాజ్, సీఆర్పీ అరుణ్‌కుమార్, మీకోసం మేము సంస్థ పదాధికారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభావంత విద్యార్థులకు ప్రోత్సాహం

● పేద విద్యార్థుల సహాయార్థం వసతి గృహం, పాఠశాల, కళాశాల ప్రారంభిస్తాం
● కమ్మసంఘం జిల్లా కార్యదర్శి దామోదర్ చౌదరి



చెక్కులు అందుకున్న విద్యార్థులు

బళ్లారి సిటీ, జూలై 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతుల పిల్లలను విద్యావంతులను చేయాలనే ఉద్దేశంతో నగరంలో కమ్మ మహాజన సంఘం ఆధ్వర్యంలో వసతి గృహం, శిక్షణ కేంద్రం, పాఠశాల, కళాశాలలను ప్రారంభించారని పలువురు సలహాలు ఇచ్చారని సంఘం కార్యదర్శి దామోదర్ చౌదరి తెలిపారు. ఆదివారం స్థానిక కోర్టురోడ్డులోని కమ్మ కల్యాణ మంటపంలో జరిగిన 2024-25 వార్షిక సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. కల్యాణ మండపం, వాణిజ్య దుకాణాల ద్వారా వచ్చే ఆదాయంతో ప్రతిభావంత విద్యార్థులకు సీఈటీ, నీట్, సివిల్స్, కేఎస్ఎస్ తదితర పరీక్షల శిక్షణ కోసం ప్రత్యేక హాల్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ భవనానికి ఇప్పటికే నగర పాలికె నుంచి అనుమతి వచ్చిందని త్వరలో పనులు మెదలవుతాయన్నారు. బళ్లారి రాఘవ స్మారక సమితి గౌరవాధ్యక్షుడు కే.చెన్నప్ప మాట్లాడుతూ కమ్మ సంఘంలో పేదలు, మధ్య తరగతి ప్రజలు ఉన్నారన్నారు. సంఘం తరపున నగర్లలో స్థలం కొని పాఠశాల,కళాశాలను ప్రారంభిస్తే అనుకూలంగా ఉంటుందని సలహా ఇచ్చారు. న్యాయవాది కోటేశ్వరరావు , ముండ్లూరు అనూప్‌కుమార్, ఈనేపథ్యంలో కొంతమంది దాతలు స్థలం కొనుగోలుకు విరాళాలు ప్రకటించారు. అనంతరం సంఘం అభివృద్ధి గురించి ఉపాధ్యక్షుడు ముల్లంగి చంద్రశేఖర్ చౌదరి వివరించారు. అనంతరం ప్రతిభావంత విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.25వేల చెక్కు అందజేశారు. సమావేశంలో సంఘం ప్రతినిధులు ముండ్లూరు రమేశ్ బాబు, వైకుంఠం ఇందిర, ప్రబాకర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కంప్లి, జూలై 21(ఆంధ్రజ్యోతి) : తాలుకా పరిధిలోని పాత నెల్లూడి క్రాస్ వద్ద సోమవారం ఉదయం రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. కురుగోడు పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఎమ్మిగనూరు గ్రామానికి చెందిన తిరుమల రంగారావు (34) ఉదయం కంప్లి నుంచి ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి వెళ్తున్నాడు. పాత నెల్లూడి క్రాస్ వద్ద ఎమ్మిగనూరు వైపు నుంచి వస్తున్న కారు అదుపు తప్పి బైక్‌ను ఢీకొనడంతో రంగారావుకు తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం బళ్లారికి తరలించారు. అయితే చికిత్స ఫలించక ఆస్పత్రిలో మృతి చెందారని ఎస్ఐ సుప్రీత్, విరుపాక్షప్ప తెలిపారు. కారుపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తామని తెలిపారు. యువకుడి మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.



తిరుమల రంగారావు(ఫైల్)

క్రీడలతో మానసిక ఒత్తిళ్లు దూరం : ఎమ్మెల్యే



కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గణేష్

కంప్లి, జూలై21(ఆంధ్రజ్యోతి) : యువకులు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని, క్రీడలతో మానసిక ఒత్తిళ్లు దూరమవుతాయని ఎమ్మెల్యే గణేష్ అన్నారు. ఎమ్మిగనూరులో సోమవారం క్రీడాభిమాని కనకప్ప సునగర్ ఆధ్వర్యంలో జరిగిన కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిత్యం ఒత్తిళ్లకు లోను కాకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. మొబైళ్లు, టీవీలకు అతుక్కుపోరాదన్నారు. చదువుతో పాటు యోగా, ధ్యానంపై దృష్టి సారించాలన్నారు. గ్రామాల్లో ధార్మిక కార్యక్రమాలతో పాటు ఇలాంటి క్రీడల వల్ల గ్రామాల్లో ఐక్యత పెరుగుతుందన్నారు. ఆయన స్వయంగా కబడ్డీ ఆడి పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కనకప్ప రాఘవేంద్రరెడ్డి, రాజా, ఖాసీం సాబ్, వీరేష్, జడమూర్తి, చంద్రశేఖర్, నాగరాజు, బసవరాజు జడప్ప, సిద్దప్ప, షణ్ముఖప్ప గ్రామస్థులు, క్రీడలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు గొలుసు దొంగల అరెస్టు

బళ్లారి సిటీ, జూలై 21(ఆంధ్రజ్యోతి): సండూరు తాలూకాలోని బన్నిహట్టి గ్రామ శివారులో ఓ దుకాణంలో మహిళ నుంచి బంగారు గొలుసును దొంగిలించి పారిపోయిన ఇద్దరు దొంగలను తోరణగల్లు పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. బన్ని హట్టి గ్రామానికి చెందిన హులిగెమ్మ తన దుకాణంలో వ్యాపారం చేస్తుండగా బైక్ పై వచ్చిన ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు సిగరెట్లు కొని లైటర్ కావాలని అడిగారు. అదే సమయంలో మహిళ మెడలో ఉన్న 10గ్రాముల బంగారు గొలుసును దొంగిలించి మహిళను బయటకు తోసి పారిపోయారు. ఎస్పీ మార్గదర్శకత్వంలో తోరణగల్లు పోలీస్ స్టేషన్ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గుడారా నగర్ వాసులు నరేంద్ర, శేఖర్ అనే ఇద్దరిని అరెస్టు చేశారు. గొలుసును స్వాధీనం చేసుకుని కస్టడీకి తరలించారు.


పోలీస్ స్టేషన్ల పరిధి మార్పునకు గెజిట్ నోటిఫికేషన్

● ఫలించిన ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి శ్రమ ● సీఎం, డీసీఎంకు కృతజ్ఞతలు

బళ్లారి, జూలై 21(ఆంధ్రజ్యోతి): బళ్లారి నగర శాసనసభ క్షేత్ర పరిధిలో ఉన్న పోలీస్‌స్టేషన్లు బళ్లారి గ్రామీణ శాసనసభ పరిధిలో ఉన్నాయి. వీటి పరిధి మార్పునకు సోమవారం ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. బళ్లారి నగర క్షేత్ర పరిధిలో ఉండే ప్రజలు పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదులు ఇవ్వాలంటే గ్రామీణ ప్రాంతంలో ఉండే పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాలి, దీని వల్ల చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో ఆశాస్త్రీయంగా పోలీస్‌స్టేషన్ల పరిధిని ఏర్పాటు చేయడంతో ఫిర్యాదు దారులు ఇబ్బంది పడేవారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఆయా ప్రాంతాలను ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలోకి చేర్చాలని ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి సీఎం డీసీఎం, హోం మంత్రులను కోరారు. గెజిట్ జారీతో తన శ్రమ ఫలించినట్లయ్యిందని ఎమ్మెల్యే హర్షం వ్యక్తం చేశారు. సీఎం, డీసీఎంలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

న్యాయం చేయాలని వరి రైతుల వినతి

కంప్లి, జూలై 21(ఆంధ్రజ్యోతి): వరి ధాన్యం కొనుగోలు చేసిన వ్యాపారుల చేతిలో మోసపోయామని, న్యాయం చేయాలని రైతులు ఎమ్మెల్యే గణేష్‌ను కోరారు. తాలుకా పరిధిలోని సన్నాపురం, ఇటిగి, ముద్దాపురం బసవేశ్వర క్యాంపు, నారాయణ స్వామి క్యాంపు, మట్టి రామాలయం క్యాంపు, బెళగోడుహాళ్ మారెమ్మ క్యాంపు తదితర గ్రామాల్లో వరిధాన్యం కొనుగోలు నారాయణస్వామి క్యాంపునకు చెందిన వ్యాపారస్తులు బోయపాటి కొండయ్య నుంచి డబ్బులు ఇప్పించండి సార్ అని ఎమ్మెల్యేను కోరారు. ఈ సందర్భంగారైతులు చొక్కారావు, ప్రసాద్ గౌడ, సురేష్, భీమనగౌడ, ఉల్లిగడ్డ, ఈరణ్ణ, శరణప్ప రైతులతో పాటు సన్నాపురం ప్రముఖులు మూకయ్యస్వామి తదితరులు మాట్లాడుతూ ఏప్రిల్, మే నెలలో బోయపాటి కొండయ్య వరి ధాన్యం తీసుకున్న వెంటనే డబ్బులు ఇస్తానని60 మంది రైతుల నుంచి రూ. 2.10 కోట్ల ధాన్యాన్ని వారు కొనుగోలు చేశారని, డబ్బులు ఇవ్వకపోగా ఐపీ నోటీసులు పంపించారన్నారు. కష్టపడి పండించిన పంటకు సొమ్ము రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన ఎమ్మెల్యే విచారించి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.



వాహనాలను అందజేస్తున్న మాజీ మంత్రి నాగేంద్ర

లబ్ధిదారులకు ద్విచక్రవాహనాల పంపిణీ

బళ్లారి సిటీ, జూలై 21(ఆంధ్రజ్యోతి): కర్ణాటక మహర్షి వాల్మీకి షెడ్యూల్డ్ తెగల అభివృద్ధి కార్పొరేషన్ లిమిటెడ్ ద్వారా ఎంపికైన 150మంది లబ్దిదారులకు బళ్లారి రూరల్ ఎమ్మెల్యే నాగేంద్ర సోమవారం వాహనాలు అందజేశారు. బళ్లారి తాలూకా పంచాయితీ కార్యాలయం ఆవరణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేంద్ర విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఐదు హామీ పథకాలను పూర్తిగా అమలు చేయడంతో పాటు, అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం దేశంలోనే ఆదర్శంగా నిలిచిందన్నారు. శక్తి, అన్నభాగ్య, గృహజ్యోతి, గృహలక్ష్మీ,యువనిధి వంటి హామీ పథకాల ద్వారా ఏటా ప్రజలకు దాదాపు రూ.62,000 కోట్ల గ్రాంట్లు అందిస్తున్నామని ఆయన అన్నారు. ఇటీవల విజయనగరం జిల్లాలో నిర్వహించిన సాధన సమావేశ కార్యక్రమం ప్రజలు అభినందిస్తూ, ప్రశంసిస్తున్న పనికి నిదర్శనమన్నారు. బళ్లారి జిల్లాలో అభివృద్ధి పనులు సజావుగా జరుగుతున్నాయన్నారు. జిల్లాలో గంజాయి అక్రమ అమ్మకాలు,జూదం అరికట్టడానికి ప్రభుత్వం ఇప్పటికే 'పోలీస్ టు డోర్స్' అనే వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించిందని , దీనిని దశలవారీగా జిల్లాలో అమలు చేస్తామన్నారు. సమాజంలోని అన్ని వర్గాలను ముందుకు తీసుకురావడానికే తమ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈసందర్భంగా బళ్లారి తాలూకా హామీ పథకం అమలు అథారిటీ ఛైర్మన్ గోనాల్ ఎం.నాగభూషణ్‌గౌడ, బళ్లారి తాలూకా నిర్వాహకుడు , సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ చిదానంద , తాలూకా ఈఓ శ్రీధర్, తాలూకా స్థాయి శాఖల అధికారులు పాల్గొన్నారు.

హోసూరు జోన్

జిలెటిన్‌స్టిక్స్, డిటోనేటర్ల స్వాధీనం





స్వాధీనం చేసుకున్న పేలుడు సామగ్రి

హోసూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి): హోసూరు - రాయకోటై మార్గంలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా లైసెన్స్ లేకుండా అక్రమంగా తరలిస్తున్న జిలెటిన్‌స్టిక్స్, డిటోనేటర్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కారు డ్రైవర్‌ను ప్రశ్నించగా కృష్ణగిరిలోని ఓల్డ్‌పేటకు చెందిన అబ్దుల్ (41) అనే వ్యక్తి కంప్రెజర్ ట్రక్కుల ద్వారా లైసెన్స్ లేకుండా రాళ్లు పగులగొట్టే వ్యక్తులకు ఇస్తున్నట్టు తెలిపాడు. దీంతో డ్రైవర్‌ను అరెస్టు చేసి కారులోని 824 జిలెటిన్ స్టిక్స్ 550 డిటోనేటర్లును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

హోసూరులో భారీ వర్షం



జలమయమైన ప్రధాన రహదారి

హోసూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి): హోసూరు, చుట్టుపక్కల ప్రాంతాలలో భారీ వర్షాలు కురుస్తుండడంతో ట్రాఫిక్‌కు అంతరాయం నెలకొంది. సోమవారం కూడా ఓ మోస్తరు వర్షం కురవడంతో పలు చోట్లపై వర్షపునీరు నిలిచింది. మధ్యాహ్నం తర్వాత వర్షం తీవ్రత పెరిగింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. వాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడ్డారు.



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్

రోడ్డు పనులకు ఎమ్మెల్యే ప్రకాశ్ భూమిపూజ

హోసూరు రూరల్, జూలై 21(ఆంధ్రజ్యోతి): హోసూరు నియోజకవర్గంలోని ఓన్నల్వాడి పంచాయతీలో ముఖ్యమంత్రి గ్రామీణ రోడ్ల అభివృద్ధి పథకం కింద గోకుల్‌నగర్ సర్కిల్ నుంచి గోకుల్‌నగర్ వరకు రూ.24.40 లక్షలతో తారు రోడ్డు పనులకు శ్రీకారం చుట్టారు. నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రకాశ్ లాంఛనంగా భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో జాయింట్ ఇన్‌చార్జ్ రామూర్తి, యూనియన్ మాజీ కమిటీ సభ్యుడు రమేశ్, పంచాయతీ మాజీ అధ్యక్షుడు మాదేశ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

హోస్పేట, జూలై 21(ఆంధ్రజ్యోతి): మైసూర్‌లోని చామరాజేంద్ర ప్రభుత్వ విజువల్ ఆర్ట్స్ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి మొదటి బ్యాచిలర్ ఆఫ్ విజువల్ ఆర్ట్స్ బీవీఏ కోర్సులకు ఆన్‌లైన్‌లో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆ కళాశాల డీన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెకండ్ పీయూసీ ఉత్తీర్ణులై సెకెండ్ పీయూసీకి సమాంతరంగా కోర్సు చేసిన విద్యార్థులు జూలై 30నాటికి బ్యాచ్‌లర్ ఆఫ్ విజువల్ ఆర్ట్స్ బీవీఏ నాలుగు సంవత్సరాలు, ఎనిమిది సెమిస్టర్ల ఎస్ఈపీ విధానంలో మిగిలిన సీట్లకు దరఖాస్తు చేసుకోవడానికి అనుమతించబడ్డారు. ఈ డిగ్రీ 3వ సెమిస్టర్ నుంచి పెయింటింగ్, స్కల్ప్చర్, గ్రాఫిక్ ఆర్ట్స్ ప్రింట్‌మేకింగ్, అప్లైడ్ ఆర్ట్స్, ఆర్ట్ హిస్టరీ, ఫోటోగ్రఫీ, ఫోటో జర్నలిజం విభాగాలలో బ్యాచిలర్ ఆఫ్‌స్పెషల్ స్టడిస్ డిగ్రీగా ఉంటుంది. మరిన్ని వివరాలకు సెల్: 0821-2438931 నెంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

మైనార్టీ హాస్టళ్లలో...

2025-26 సంవత్సరానికి మైనార్టీ సంక్షేమ శాఖ యొక్క పోస్ట్-మెట్రిక్ బాలుర, బాలికల హాస్టళ్లకు, పీయూసీ సమాంతర కోర్సులు, డిగ్రీ స్థాయి కోర్సుల విద్యార్థులకు తాజా దరఖాస్తుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మైనార్టీ సంక్షేమశాఖ జిల్లా అధికారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులు సమర్పించడానికి ఆగస్టు 2వ తేదీ అన్నారు. మరిన్ని వివరాల కోసం సెల్‌ఫోన్: 8277799990, 8050435366, 9980237242, 7353696984 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

కమ్యూనిటీ మొబిలైజర్ పోస్టులకు..

జిల్లాలోని హోస్పేట మున్సిపల్ కౌన్సిల్‌లో 11 మొబిలైజర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా పట్టణాభివృద్ధి సెల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హరపనహళ్లి మున్సిపాలిటీలో 2, హగరిబొమ్మనహళ్లి మున్సిపాలిటీలో 4, మరియమ్మనహళి పట్టణ పంచాయతీలో 1 పోస్టులకు పట్టణ స్థానిక సంస్థల్లో స్వచ్ఛ భారత్ మిషన్ 2.0 పథకం కింద ఐఈసీ కార్యకలాపాల నిర్వహణ కోసం కమ్యూనిటీ మొబిలైజర్ పదవికిస్వయం సహాయక మహిళా సంఘంలో ఆసక్తి గల సభ్యుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆయన తెలిపారు.